నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com



హైదరాబాద్ శుక్రవారం 26-3-2021 RNI No.52865/93·Postal No\.H/SD/258/2020-2022 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 సంపుటి :27 సంచిక: 195 పేజీలు: 4 వెల: రూ.1/-

నగరంలో మరో 10 ఘన వ్యర్థ నిర్వహణ ప్లాంట్లు

హైదరాబాద్, మార్చి 25: నగరంలో మరో 10 ఘన వ్యర్థ నిర్వహణ ప్లాంట్లను ఏర్పాటు చేయనున్నట్లు మేయర్ జి. విజయలక్ష్మి తెలిపారు.

హైదరాబాద్‌లోని ఘన వ్యర్థాల నిర్వహణ ప్లాంట్లను మేయర్ గురువారం క్షేత్రస్థాయిలో తనిఖీ చేశారు. జీహెచ్ఎంసీ పరిధిలో ఘన వ్యర్థాల నిర్వహణకు అందుబాటులో ఉన్న ఉత్తమ పద్ధతులను అవలంభిస్తున్న అధికారులను మేయర్ ఈ సందర్భంగా అభినందించారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో మొత్తం 21 ఘన వ్యర్థ నిర్వహణ ప్లాంట్లు ఉన్నాయి. వీటికి అదనంగా మరో 10 ప్లాంట్లను ఏర్పాటు చేయనున్నట్లు మేయర్ తెలిపారు.

వీధులు, రహదారులు చెత్త, చెదారంతో కాకుండా స్వచ్ఛ హైదరాబాద్‌గా ఉండటమే తమ లక్ష్యమన్నారు. సంజీవయ్య పార్కులోని ఘన వ్యర్థ నిర్వహణ ప్లాంట్‌ను మేయర్ తనిఖీ చేసిన సందర్భంగా జీహెచ్ఎంసీ కమిషనర్ డీఎస్ లోకేశ్ కుమార్ మాట్లాడుతూ బంజారాహిల్స్, జూబ్లీహిల్స్‌లో ప్లాంట్ ఏర్పాటుకు తగిన స్థలం కేటాయించాల్సిందిగా కోరారు. అడిషనల్ కమిషనర్ సంతోష్, జోనల్ కమిషనర్ ప్రవీణ్య ఇతర అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

తెలంగాణలో పెరుగుతున్న కరోనా కేసులు

–తాజాగా మరో నలుగురు మృత్యువాత

హైదరాబాద్,మార్చి25(ఆర్ఎన్ఎ): తెలంగాణలో కరోనా కేసులు రోజురోజుకీ పెరుగుతున్నాయి. వారం రోజులుగా జీహెచ్ఎంసీ పరిధిలో కొత్త కేసుల సంఖ్య పెరుగుతూ వస్తోంది. రాష్ట్రంలో బుధవారం రాత్రి 8 గంటల వరకు 56,464 కరోనా నిర్ధారణ పరీక్షలు నిర్వహించగా.. 493 పాజిటివ్ కేసులు నమోదయ్యాయి. దీంతో మొత్తం ఇప్పటి వరకు నమోదైన కేసుల సంఖ్య 3,04,791కి చేరింది. ఈ మేరకు వైద్య ఆరోగ్య శాఖ గురువారం ఉదయం బులిటెన్ విడుదల చేసింది. తాజాగా కొవిడ్‌తో నలుగురు మృతిచెందారు. దీంతో ఇప్పటి వరకు మృతిచెందిన వారి సంఖ్య 1680కి చేరింది. కరోనా బారి నుంచి నిన్న 157 మంది కోలుకున్నారు. ఇప్పటి వరకు కోలుకున్న వారి సంఖ్య 2,99,427కి చేరింది. రాష్ట్రంలో ప్రస్తుతం యాక్టివ్ కేసుల సంఖ్య 3,684 ఉండగా.. వీరిలో 1,616 మంది హోం ఐసోలేషన్‌లో చికిత్స పొందుతున్నారు. జీహెచ్ఎంసీ పరిధిలో కొత్తగా 138 కేసులు నమోదయ్యాయి. తెలంగాణలో ఇప్పటి వరకు నిర్వహించిన కరోనా పరీక్షల సంఖ్య 98,45,577కి చేరింది.

త్వరలోనే పోడు భూముల సమస్యకు పరిష్కారం

సిఎం స్వయంగా పరిష్కరిస్తానని ఇప్పటికే చెప్పారు
అప్పటి వరకు గిరిజనుల జోలికి వెళ్లొద్దని అధికారులకు సూచన
అసెంబ్లీలో సభ్యులు ప్రశ్నలపై మంత్రి సత్యవతి సమాధానం
ఎమ్మెల్యే సీతక్క వ్యాఖ్యలతో విభేదించిన ఎమ్మెల్యే గువ్వల బాలరాజు

హైదరాబాద్,మార్చి25(ఆర్ఎన్ఎ): త్వరలోనే పోడు భూముల సమస్యకు సీఎం కేసీఆర్ సమగ్రమైన పరిష్కారం చూపుతారని రాష్ట్ర గిరిజన, స్త్రీ,శిశు సంక్షేమ శాఖల మంత్రి సత్యవతి రాథోడ్ తెలిపారు. మంత్రివర్గం, అధికారుల సమేతంగా ముఖ్యమంత్రి కేసీఆర్ క్షేత్రస్థాయి పర్యటన చేసి పోడు భూముల సమస్యలను పరిష్కారం చేస్తానని సభాముఖంగా హామీ ఇచ్చిన విషయాన్ని మరోమారు గుర్తు చేశారు. అంతవరకు పోడు భూములు జోలికి వెళ్లవద్దని గిరిజన రైతులను ఇబ్బంది పెట్టవద్దని ఆదేశాలు ఇచ్చారు. అయినా కొంతమంది అధికారులు అత్యుత్సాహం చూపుతున్నారని మంత్రి అన్నారు. శాసనసభలో ప్రశ్నోత్తరాల సందర్భంగా రాష్ట్రంలో గిరిజన రైతుల పోడు భూముల సమస్యలపై సభ్యులు అడిగిన ప్రశ్నలకు మంత్రి సత్యవతి సమాధానం ఇచ్చారు. ఆర్ఓఎఫ్ఆర్ చట్టం కింద 2008 నుంచి 303970 ఎకరాలలో అర్హులైన 94,774 మంది హక్కుదారులకు పట్టాలను ఇవ్వడం జరిగింది. ఈ చట్టం చేసినప్పటి నుంచి 6, 3, 850 ఎకరాలకు సంబంధించి 1, 84,730 ÷–లకెయిమ్స్ అందాయి. అందులో క్షేత్రస్థాయి విచారణ చేసి అర్హులైన వ్యక్తులకు పట్టాలను జారీ చేయడం జరిగింది. 2018 నుంచి ఆర్ ఓ ఎఫ్ ఆర్ పట్టాల కోసం 27,990 క్లెయిమ్ లు 98,745 ఎకరాలకు వచ్చాయి. వాటిలో 4,248 ఎకరాల్లో 2401 క్లెయిమ్స్ అర్హత ఉన్నవని గుర్తించి పట్టాలు ఇవ్వడం జరిగింది. మరో 40,780 సంబంధించిన ఎకరాలకు సంబంధించిన 9976 ÷–లకెయిమ్ లను డి ఎల్ సి ద్వారా అర్హత లేనివిగా నిర్ధారించారు. 53, 565 ఎకరాలకు సంబంధించి 15,558 ÷–లకెయిమ్ లు డి ఎల్ సి ల పెండింగ్ లో ఉన్నాయి. అటవీ భూముల్లో అభివృద్ధి పనులు కొనసాగేలా ఒక లైసన్ అధికారిని పెట్టే సమస్యలు రాకుండా ఉండేలా ఆలోచనా చేస్తున్నాం. ప్రతి గిరిజన ఆవాసానికి 3 ఫేజ్ కరెంట్ ఇవ్వడానికి 220 కోట్ల రూపాయలు కేటాయించి, పనులు చేస్తున్నాం. గిరి వికాసం పథకం కింద వ్యవసాయేతర భూములను సాగు యోగ్య భూములుగా చేసేందుకు వ్యవసాయ ఉపకరణాలు, ఆర్థిక సాయం అందిస్తున్నాం. నల్లమల అడవిలో అటవీ ఉత్పత్తుల కోసం వెళ్లిన చెంచులు ప్రమాదవశాత్తు మంటల్లో చిక్కుకోవడం వల్ల కొంతమందికి తీవ్ర గాయాలు అయ్యాయి. వెంటనే వారిని హైదరాబాద్ కు తరలించి ఉస్మానియా హాస్పిటల్ లో చేర్పించి వైద్యం అందించాం. దురదృష్టవశాత్తూ వారిలో ముగ్గురు హైదరాబాద్ లోని ఉస్మానియా హాస్పిటల్ చికిత్స పొందుతూ చనిపోయారు. చనిపోయిన వారి కుటుంబాలకు లక్ష రూపాయల చొప్పున ఎక్స్‌గ్రేషియా అందించాం. గాయ పడ్డ వారికి ,50 వేల చొప్పున ఎక్స్గ్రేషియా అందించి, వారి వైద్యానికి కావలసిన పూర్తి ఖర్చులను ప్రభుత్వమే భరిస్తోంది. ధరణి పోర్టల్లో భూములను ఎక్కించడం, రైతుబంధు కొంతమందికి అందకపోవడం, హరితహారం కింద అడవుల్లో చెట్లను పెంచుతూ, అటవీ సంరక్షించే చర్యలు చేపట్టడం వల్ల ఆందోళన పోడు భూముల గిరిజన రైతుల్లో ఇటీవల ఆందోళన ఎక్కువ అయ్యింది. త్వరలో ముఖ్యమంత్రి కేసీఆర్ ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతారు అని మంత్రి సత్యవతి స్పష్టం చేశారు. అయితే పోడు భూముల విషయంలో కాంగ్రెస్ – టీఆర్ఎస్ మధ్య సభలో వాగ్వాదం చోటు చేసుకుంది. సీతక్క మాటలను కౌంటర్ చేస్తూ టీఆరెస్ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు మాట్లాడారు. గువ్వల బాలరాజు మాట్లాడిన అనంతరం సీతక్కకు స్పీకర్ పోచారం మైక్ ఇవ్వకపోవడంపై కాంగ్రెస్ నేతలు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ క్రమంలో మంత్రి సత్యవతి రాథోడ్ కలుగజేసుకుని సమస్యపై సమాధానం చెప్పారు. ఎమ్మెల్యే గువ్వల బాలరాజు మాట్లాడుతూ పోడు భూముల సమస్యలను పరిష్కరిస్తామని సీఎం చెప్పారని తెలిపారు. గత ప్రభుత్వాలు పోడు భూముల సమస్యలు పరిష్కరించే ప్రయత్నం చేయలేదని విమర్శించారు. రైతుల కోసం ఫారెస్ట్ అధికారులతో తనకు వాగ్వాదం జరిగిందని తెలిపారు. ప్రజల పక్షాన నిలవాల్సిన సమయంలో ఇతర పార్టీలు తనపై దాడికి దిగారని మండిపడ్డారు. పోరాడితే పోయేది ఏముంది బానిస సంకెళ్లు తప్ప అని రైతుల కోసం ఫైట్ చేసినట్లు చెప్పారు. తమ చెంచులకు– ట్రైబల్స్– రైతులకు ఇబ్బంది అయితే తమ స్పిరిట్ చూపిస్తామని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. సీతక్కకు ట్రైబల్స్ పట్ల పట్టింపు ఉంటే రైతుల కోసం ప్రభుత్వం పోరాటం చేస్తే తమకు మద్దతు ఇవ్వలేదన్నారు. మద్దతు ఇవ్వకపోగా అసెంబ్లీ వేదికగా ప్రభుత్వాన్ని– చెంచు అవుదారులను అవమానించే విధంగా సీతక్క మాట్లాడొద్దని హితవుపలికారు. చెంచుల సమస్యలు పరిష్కరించడం సీఎం వల్ల మాత్రమే అవుతుందని ఎమ్మెల్యే గువ్వల బాలరాజు స్పష్టం చేశారు.

ఆరున్నరేండ్లలో 73 శాతం జీతాలు పెంచిన ఘనత కెసిఆర్‌ది

మంత్రి శ్రీనివాస్‌గౌడ్ వెల్లడి

హైదరాబాద్,మార్చి25(ఆర్ఎన్ఎ): ప్రభుత్వ ఉద్యోగులకు దేశంలోనే అత్యధిక వేతనాలు అందిస్తున్న రాష్ట్రం తెలంగాణ అని మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. ఆరున్నరేండ్లలో 73 శాతం జీతాలు పెంచిన ఘనత సీఎం కేసీఆర్‌కు దక్కుతుందని చెప్పారు. రాష్ట్ర బేవరేజెస్ కార్పొరేషన్‌కు కొత్తగా 60 మంది సిబ్బంది నియమితులయ్యారు. హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సీఎస్ సోమేశ్ కుమార్‌తో కలిసి మంత్రి వారికి నియామకపత్రాలు అందించారు. అనంతరం మాట్లాడుతూ.. ప్రతి ప్రభుత్వ విభాగంలో టీఆర్ఎస్ సర్కార్ నియామకాలు చేపట్టిందని వెల్లడించారు. గతంలో పొరుగు రాష్ట్రాల నుంచి మద్యం అక్రమంగా రవాణా అయ్యేందని చెప్పారు. ప్రస్తుతం అక్రమ రవాణాను అరికట్టామని, దీంతో ఆదాయం పెరిగిందని వెల్లడించారు. కొత్తగా నియమితులైన ఉద్యోగులు నిబద్ధతతో పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆబ్కారీ శాఖ అడిషనల్ కమిషనర్ అజయ్ రావు, రెవెన్యూశాఖ జాయింట్ సెక్రటరీ రాంసింగ్, టీఎస్‌బీసీఎల్ ఓఎస్డీ సంతోష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



స్వచ్ఛతకు ప్రజల తోడ్పాటు కూడా అవసరమే

కరోనా వేళ స్వచ్ఛతకు ప్రాధాన్యం ఇవ్వాలి
స్వచ్ఛ ఆటోలను ప్రారంభించిన మంత్రి కెటిఆర్

హైదరాబాద్,మార్చి25(ఆర్ఎన్ఎ): స్వచ్ఛత అనేది కేవలం ప్రభుత్వం, జీహెచ్ఎంసీతోనే కాదని.. ప్రజలు సైతం భాగస్వాములు కావాలని మంత్రి కేటీఆర్ పిలుపునిచ్చారు. నగరాలు స్వచ్ఛంగా ఉంచుకునే క్రమంలో ప్రజలు తమ తోడ్పాటును అందించాలన్నారు. గురువారం నగరంలోని నెక్లెస్‌రోడ్‌లో 325 స్వచ్ఛ ఆటోలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కరోనా మళ్లీ విజృంభిస్తున్న వేళ స్వచ్ఛత చాలా అవసరమని అభిప్రాయపడ్డారు. సీఎం కేసీఆర్ నాయకత్వంలో స్వచ్ఛతను, పారిశుధ్యాన్ని ఒక ప్రాధాన్యం గా తీసుకొని 2015లో స్వచ్ఛ హైదరాబాద్ కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు గుర్తు చేశారు. ఇందులో భాగంగా ఇప్పటి వరకు 2,500 స్వచ్ఛ వాహనాలను అందుబాటులోకి తీసుకువచ్చామన్నారు.

మరో 650 కొత్త స్వచ్ఛ ఆటోలను అందుబాటులోకి తీసుకువస్తున్నామని, ఇందులో ఇవాళ 325 ఆటోలను నగరంలో ప్రవేశపెడుతున్నట్లు చెప్పారు. చెత్తకుండీలు లేని నగరంగా హైదరాబాద్‌ను తీర్చిదిద్దుతామన్నారు. నగరాన్ని శుభ్రంగా ఉంచేందుకు కలిసి ప్రజలు కలిసి రావాలని పిలుపునిచ్చారు. తడి పొడి చెత్త సేకరణ కోసం పంపిణీ చేసి బుట్టలను వినియోగం తెచ్చి ఇండ్ల వద్దకు వచ్చే ఆటో డ్రైవర్లకు అందజేయాలని కోరారు.

నగర స్వచ్ఛతకు కృషి చేస్తున్న జీహెచ్ఎంసీ పాలకవర్గాన్ని, అధికార యంత్రాంగం, సిబ్బంది మంత్రి అభినందించారు. అలాగే శానిటేషన్‌పై మరింత దృష్టి సారించాలన్నారు.

ప్రస్తుతం కరోనా కేసులు పెరుతున్న నేపథ్యంలో మరింత స్వచ్ఛత వసరమన్నారు. లాక్‌డౌన్ సమయంలో సమర్థవంతంగా జీహెచ్ఎంసీ పటిష్ట చర్యలు చేపట్టిందని.. మరోసారి ప్రజలను అప్రమత్తం చేస్తూ.. అవసరమైతే మరోసారి స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలన్నారు. చెత్తను తరలించేందుకు ఇంతవరకు ఉన్న పాత వాహనాలకు స్వస్తి పలికి స్వచ్ఛ ఆటోలను నడిపిస్తున్నామని ఆయన చెప్పారు. ఒక్కో స్వచ్ఛ ఆటో 1.5 మెట్రిక్ టన్నుల గార్బేజ్ ను తరలిస్తుందని ఆయన పేర్కొన్నారు. డ్రైవర్ కం ఓనర్ పద్ధతిలో అందించే ఈ ఆటోలను పదిశాతం లబ్దిదారుడు, 90 శాతం జిహెచ్ఎంసి భరిస్తున్నట్టు ఆయన వెల్లడించారు. నగరంలోని అన్ని ప్రాంతాల్లో స్వచ్ఛ ఆటోలు సేవనందిస్తాయని ఆయన తెలిపారు. ప్రతిరోజు ఒక్కో స్వచ్ఛ ఆటో 600 ఇళ్ల నుంచి చెత్తను సేకరిస్తుందని, ఈ ఆటోల్లో తడి, పొడి చెత్తకు వేర్వేరు పార్టిషన్ ఉండడంతో పాటు ప్రమాదకర వ్యర్థాలకు ప్రత్యేకంగా బాక్స్ ఏర్పాటు చేసినట్టు ఆయన పేర్కొన్నారు. గ్రేటర్ హైదరాబాద్ లో శానిటేషన్ పై ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలని ఆయన మేయర్, కమిషనర్‌కు సూచించారు. కార్యక్రమంలో మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్, మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, జీహెచ్ఎంసీ కమిషనర్ లోకేశ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

24,543 గ్రామాలకు తాగునీటి సరఫరా

మిషన్ భగీరథ పథకం కింద అమలు చేస్తున్నాం
అసెంబ్లీలో సభ్యుల ప్రశ్నలకు మంత్రి ఎర్రబెల్లి సమాధానం

హైదరాబాద్,మార్చి25(ఆర్ఎన్ఎ): రాష్ట్ర వ్యాప్తంగా మిషన్ భగీరథ పథకం కింద 24,543 గ్రామాలకు తాగునీరు సరఫరా చేస్తున్నామని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు తెలిపారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు కూడా ఈ పథకాన్ని వర్తింపజేశామని స్పష్టం చేశారు. శాసనసభలో ప్రశ్నోత్తరాల సందర్భంగా మిషన్ భగీరథ కింద తాగునీరు ఎన్ని గ్రామాలకు సరఫరా చేస్తున్నారని సభ్యులు అడిగిన ప్రశ్నలకు సమాధానం ఇచ్చారు. ఛత్తీస్‌గఢ్ నుంచి వలస వచ్చిన ఆదివాసీ గ్రామాలకు కూడా నీరు అందిస్తున్నాం. మొత్తం 74 ఆదివాసీ శివారు గ్రామాలకు మిషన్ భగీరథ సరఫరా చేస్తున్నామని తెలిపారు. కొన్ని చోట్ల జాతీయ రహదారుల పనుల వల్ల పనుల్లో కొంచెం ఆలస్యం జరుగుతుందన్నారు. చిన్నచిన్న ఆవాస గ్రామాలకు కూడా నీళ్లు ఇస్తున్నాం. ఇంకా ఏమైనా సమస్యలున్నా పరిష్కరించుకుందామని చెప్పారు. మిషన్ భగీరథ జలాల పంపిణీపై సమీక్షలు నిర్వహించాలని ఎమ్మెల్యేలకు ఇప్పటికే లేఖలు రాశానని తెలిపారు. కరెంట్ లేని ప్రాంతాల్లో సోలార్ పవర్ ద్వారా నీళ్లు సరఫరా చేస్తున్నామని పేర్కొన్నారు. కుండలు, బిందెల ప్రదర్శనలు ఇప్పుడు లేవన్నారు. ఈ పథకానికి ముఖ్యమంత్రే ఇంజినీర్. వారి డైరెక్షన్‌లోనే ఈ పథకం అమలవుతుందని మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు స్పష్టం చేశారు.

కొన్ని చోట్ల జాతీయ రహదారుల పనుల వల్ల పనుల్లో ఆలస్యం జరుగుతుందని తెలిపారు. చిన్నచిన్న ఆవాస గ్రామాలకు కూడా నీళ్లు ఇస్తున్నామని పేర్కొన్నారు.విద్యుత్ లేని ప్రాంతాల్లో సోలార్ పవర్ ద్వారా తాగునీటిని పంపిణీ చేస్తున్నామని ఆయన స్పష్టం చేశారు.

త్వరలోనే షాద్‌నగర్ కాలేజీ నిర్మాణం పూర్తి: సబిత

హైదరాబాద్,మార్చి25(ఆర్ఎన్ఎ): ప్రభుత్వ డిగ్రీ కళాశాల నిర్మాణం త్వరలోనే పూర్తి చేస్తామని శాసనసభలో ప్రశ్నోత్తరాల సందర్భంగా షాద్‌నగర్‌లో పై ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ అడిగిన ప్రశ్నకు విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి సమాధానం ఇచ్చారు. ఇప్పటికే షాద్‌నగర్‌కు ప్రభుత్వ డిగ్రీ కాలేజీని మంజూరు చేశామన్నారు. దీని నిర్మాణం పూర్తయ్యే దశలో ఉందని, ప్రహరీ గోడను మే చివరి నాటికి పూర్తి చేస్తామని తెలిపారు. 123 ప్రభుత్వ డిగ్రీ కాలేజీలు ఉన్నాయి. వీటిని బలోపేతం చేస్తూ ముందుకెళ్తున్నామని చెప్పారు. ప్రభుత్వ డిగ్రీ కాలేజీల్లో క్వాలిటీ ఎడ్యుకేషన్ కోసం ల్యాబ్‌లు, లైబ్రరీలు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. షాద్‌నగర్ డిగ్రీ కాలేజీ పనులు గతేడాది చేయలేదు.. త్వరలోనే అధికారులను పంపి రివ్యూ చేస్తామన్నారు. త్వరలోనే వీటి పనులు పూర్తి చేసి అప్పగిస్తామని మంత్రి సబిత తెలిపారు.

హోలీ రోజు వైన్‌షాపులు బంద్

హైదరాబాద్, మార్చి 25: హోలీ వేడుకల నేపథ్యంలో హైదరాబాద్, సికింద్రాబాద్ జంటనగరాల్లోని వైన్‌షాపులు, బార్లు, కల్లు దుకాణాలు బంద్ పాటించాల్సిందిగా తెలుపుతూ హైదరాబాద్ పోలీసు కమిషనర్ అంజనీ కుమార్ ఆదేశాలు జారీ చేశారు. మార్చి 28వ తేదీ సాయంత్రం 6 గంటల నుండి మార్చి 30వ తేదీ ఉదయం 6 గంటల వరకు ఈ ఆదేశాలు అమల్లో ఉంటాయని తెలిపారు.

ఇతరులకు అసౌకర్యం కలిగించడం, రోడ్లపై రంగులు చల్లడం, గుంపులుగా వాహనాలపై తిరగడం వంటి తదితర చర్యలను నిషేధిస్తూ మరో ప్రత్యేక ఉత్తర్వులు వెలువరించారు. ఈ నియమాలను ఉల్లంఘించినైట్లైతే అటువంటి వ్యక్తులు విచారణను ఎదుర్కొవాల్సి ఉంటుందని పేర్కొన్నారు.

ఓయూ విద్యార్థుల అరెస్ట్

హైదరాబాద్,మార్చి25(ఆర్ఎన్ఎ): నిరుద్యోగులకు ఉరితాడుగా మారిన పదవీ విరమణ వయసు పెంపు నిర్ణయాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఓయూ ఐక్య విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమం జరిగింది. దీనిలో భాగంగా అసెంబ్లీ ముట్టడి కార్యక్రమాన్ని నిర్వహించాలని విద్యార్థులు నిర్ణయించారు. అసెంబ్లీ ముట్టడికి బయలుదేరిన విద్యార్థులను ఓయూ ఆర్ట్స్ కాలేజీ వద్ద పోలీసులు అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. ముందుగానే ఓయూ చేరుకున్న పోలీసులు విద్యార్థులు ముందుకు కదలకుండా అడ్డుకున్నారు. దీంతో కొంత సేపు ఉద్రిక్తత చోటు చేసుకుంది. ప్రభుత్వ తీరుపై విద్యార్థులు మండిపడుతూ నినాదాలు చేశారు.

హామీ మేరకు కొత్తగా 50వేల ఉద్యోగాలు భర్తీ చేస్తాం

రిటైర్‌మెంట్ వయసు పెంపు అడ్డంకి కాదు
అసెంబ్లీలో ఉద్యోగుల రిటైర్మెంట్ బిల్లుకు ఆమోదం
మాజీ ప్రజాప్రతినిధుల పెన్షన్ పెంపు బిల్లులకు కూడా ఓకే
వివరాలు వెల్లడించిన మంత్రి హరీష్ రావు

హైదరాబాద్,మార్చి25(ఆర్ఎన్ఎ): నిరుద్యోగులకు రాష్ట్ర ఆర్థికమంత్రి హరీశ్ రావు తీపి కబురు అందించారు. త్వరలో 50వేల ఉద్యోగాలు భర్తీ చేయనున్నట్టు అసెంబ్లీలో ప్రకటించారు. గురువారం అసెంబ్లీలో మాట్లాడిన ఆయన.. ఉద్యోగాలపై ప్రకటన చేశారు. అంతకుముందు ప్రభుత్వ ఉద్యోగుల రిటైర్మెంట్ బిల్లు, మాజీ ప్రజాప్రతినిధుల పెన్షన్ పెంపు బిల్లులకు శాసన సభ ఆమోదం తెలిపింది. కనీస పెన్షన్ రూ. 50 వేలు కాగా, గరిష్ట పెన్షన్ రూ.70 వేలకు పెంచుతూ సభ ఆమోదం తెలిపింది. ఒకటి, రెండు, మూడు సార్లు గెలిచిన ఎమ్మెల్యేల గతంలో పెన్షన్ రూ.30వేలు కాగా దాన్ని రూ.50వేలకు పెంచారు. మూడు సార్లు అంతకుమించి గెలిచిన సభ్యుల పెన్షన్‌ను రూ. 50వేల నుంచి 70వేలకు పెంచారు. ఇక పదవీ విరమణ వయస్సు 61 ఏళ్లకు పెంపు బిల్లును కూడా సభ ఆమోదించింది. ఉద్యోగుల అనుభవాన్ని ఉపయోగించుకోవాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందన్నారు. అందరి సంప్రదింపులతోనే ప్రభుత్వం నిర్ణయానికి వచ్చిందన్నారు. ఉద్యోగాల భర్తీ విషయంలో ఇది అడ్డంకి కాదన్నారు. రాష్ట్రంలో వెనువెంటనే 50వేల ఖాళీలు భర్తీ చేసేలా సీఎం కేసీఆర్ ఆదేశాలిచ్చారని.. దీనికి సంబంధించిన నోటిఫికేషన్ త్వరలో విడుదల చేస్తామని ఆర్థికమంత్రి హరీశ్ రావు అన్నారు.

రాష్ట్రంలో ప్రభుత్వ ఉద్యోగుల పదవీ విరమణ వయసు 58 ఏండ్లుగా ఉంది. ప్రస్తుతం రాష్ట్రంలో 4వ తరగతి ఉద్యోగులకు రిటైర్డ్ వయసు 60 ఏండ్లు, ప్రభుత్వ వైద్య కళాశాలల్లో బోధన సిబ్బందికి పదవీ విరమణ వయసు 65 ఏండ్లుగా ఉందన్నారు. అయితే న్యాయసిబ్బి రిటైర్డ్ వయసు 60 ఏండ్లుగా ఉందన్నారు. మన దేశంలోని కొన్ని రాష్ట్రాల్లో ప్రభుత్వ ఉద్యోగుల పదవీ విరమణ వయసు 60, 62 ఏండ్లుగా ఉందని తెలిపారు. టీఆర్ఎస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు సీఎం కేసీఆర్ ప్రభుత్వ ఉద్యోగుల పదవీ విరమణ వయసును 58 నుంచి 61 ఏండ్లకు పెంచుతూ నిర్ణయం తీసుకున్నారని తెలిపారు. ఉద్యోగుల అనుభావాన్ని ఉపయోగించు కోవాలనే ఉద్దేశంతోనే ప్రభుత్వం నిర్ణయం తీసుకుందన్నారు. రిటైర్డ్ వయసు పెంపుదల వల్ల ఖాళీల భర్తీ విషయంలో ఎలాంటి ప్రభావం ఉండదన్నారు. ఉద్యోగులకు ప్రమోషన్లు ఇచ్చి ఖాళీల భర్తీని చేపడుతా మన్నారు. రాష్ట్రంలో 50 వేల పోస్టుల భర్తీకి సీఎం కేసీఆర్ ఇప్పటికే ఆదేశించారు. త్వరలోనే ఖాళీల భర్తీకి నోటిఫికేషన్లు వెలువడుతాయని మంత్రి హరీష్ రావు తెలిపారు.

నిరంతర విద్యుత్ సరఫరా సాధించిన ఘనత కెసిఆర్‌దే

దేశంలో ఎక్కడా ఇలాంటి పథకం లేదు
అసెంబ్లీ బడ్జెట్ పద్దులపై చర్చలో మంత్రి జగదీశ్వర్ రెడ్డి

హైదరాబాద్,మార్చి25(ఆర్ఎన్ఎ): తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన ఆరు నెలల్లోనే విద్యుత్ సమస్యను అధిగమించామని విద్యుత్ శాఖ మంత్రి జగదీశ్ రెడ్డి స్పష్టం చేశారు. దేశంలో ఎక్కడా ఇవ్వని విధంగా నిరంతర విద్యుత్ అందిస్తున్నది తెలంగాణ మాత్రమేనని అన్నారు. సిఎం కెసిఆర్ దూరదృష్టితో మాత్రమే ఇది సాధ్యమయ్యిందన్నారు. శాసనసభలో బడ్జెట్ పద్దులపై చర్చ సందర్భంగా విద్యుత్ శాఖ పద్దులపై మంత్రి జగదీశ్ రెడ్డి వివరణ ఇచ్చారు. తెలంగాణ రాష్ట్ర తలసరి విద్యుత్ వినియోగం 2071 యూనిట్లు అని తెలిపారు. దేశ సగటు 1208 యూనిట్లు. దేశ సగటు కంటే 71 శాతం అధికంగా తెలంగాణలో తలసరి విద్యుత్ వినియోగం జరుగుతుందన్నారు. తెలంగాణ విద్యుత్ సంస్థలు దేశంలోనే నంబర్ వన్ స్థానంలో ఉన్నాయి.దేశ చరిత్రలో ఎక్కడా లేని విధంగా రైతాంగానికి ఉచిత విద్యుత్ ఇస్తున్న రాష్ట్రంగా తెలంగాణ రికార్డు సృష్టించింది. ప్రస్తుతం 355 సబ్‌స్టేషన్లు, 33 11 కేవీ సబ్‌స్టేషన్లు 3093, 7 లక్షల 62 వేల ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేసుకున్నామని చెప్పారు. ట్రాన్స్‌ఫార్మర్ల రిపేర్‌ను గంటల్లోపే చేసి.. అందుబాటులోకి తీసుకువస్తున్నామని తెలిపారు. పాతబస్తీలో విద్యుత్ పనులకు రూ. 380 కోట్లు వెచ్చించామని పేర్కొన్నారు. రాష్ట్రంలో ఏ నియోజకవర్గంలో సమస్యలున్నా పరిష్కరిస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలో విద్యుత్ కోతల్లేవ్. విద్యుత్ రంగంలో ఉద్యోగాలు భర్తీ చేశామని తెలిపారు. లైన్‌మెన్ స్థాయి నుంచి సీఎండీల వరకు చేసిన కృషి కారణంగానే విద్యుత్ రంగంలో అనేక విజయాలు సాధించామని మంత్రి స్పష్టం చేశారు.

వైద్యరంగంలో తెలంగాణ మేటి : మంత్రి సబితా ఇంద్రారెడ్డి

హైదరాబాద్, మార్చి 25: వైద్యరంగంలో దేశంలోనే తెలంగాన మేటిగా నిలుస్తోందనివిద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి అన్నారు. నగరంలోని బీఎన్‌రెడ్డినగర్ శ్రీపురం కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన బృంగి మల్టీస్పెషాలిటీ హాస్పిటల్ ప్రారంభోత్సవానికి హాజరయ్యారు. ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి, ఎమ్మెల్యేలు గువ్వల బాలరాజు, జైపాల్ యాదవ్‌లతో కలిసి మంత్రి ప్రారంభించారు. రాష్ట్ర ప్రభుత్వ విధానాల కారణంగా వైద్య రంగం ఎంతో అభివృద్ధి చెందుతున్నదని మంత్రి తెలిపారు. రాష్ట్రాన్ని హెల్త్ హబ్‌గా మార్చేందుకు సీఎం కేసీఆర్ కృషి చేస్తున్నారన్నారు. ప్రజ

భారత్ బంద్‌తో మోడీ కళ్లు తెరవాలి !

నేటినిజం
శుక్రవారం 26-3-2021

ప్రభుత్వం తీసుకున్న అనేక ప్రజావ్యతిరేక విధానాలను ఎండగడుతూ భారత్ బంద్ నిర్వహించడం ద్వారా ప్రజలు తమ నిరసనను వ్యక్తం చేయడం ఆనవాయితీగా వస్తోంది. ప్రభుత్వం ప్రజల సమస్యలను పెడచెవిన పెట్టడం వల్ల.. అనేకానేక సందర్భాల్లో వివిధ రూపాల్లో నిరసనలు తెలిపినా లాభం లేకపోవడంతో బంద్‌లు నిర్వహించడం ప్రపంచవ్యాప్తంగా అన్ని దేశాల్లోనూ ఉంది. తాజాగా భారత్‌లోనూ చాలాకాలం తరవాత ఈనెల 26న భారత్ బంద్‌కు పిలుపినిచ్చి ప్రజలు, ప్రజా సంఘాలు, కార్మిక సంఘాలు..రాజకీయ పార్టీలు తమ నిరసనను తెలియచేయబోతున్నాయి. నిజానికి ఇలాంటి పరిస్థితి వరకు రావడం పాలకులు సిగ్గుతో తలదించుకోవాలి. పాలన చేస్తున్నది ప్రజల కోసమే తప్ప కార్పోరేట్లు లేదా వారి తాబేదార్ల కోసం కాదన్నది గుర్తుంచుకోవాలి. భారత ప్రజాస్వామ్యానికి అతి సులువైన నిర్వచనం ఏమిటంటే.. ప్రజల చేత.. ప్రజల కొరకు.. ప్రజలే ఎన్నుకునే ప్రభుత్వంగా ఉండటమే ప్రజాస్వామ్యం. కానీ ఈ ప్రభుత్వం ప్రజల కోసం కాదని మెల్లగా అర్థం అవుతోంది. పెద్దపెద్ద నిర్వచనాలు ఇస్తూ..అరచేతిలో వైకుంఠం చూపిస్తున్న మోడీ వల్ల ప్రజలకు ఇసుమంత కూడా ప్రయోజనం చేకూరడం లేదు. పెద్దనోట్లు రద్దుతో మొదలైన దాడి జిఎస్టీతో కొనసాగుతోంది. గతంలో పెట్రోల్,గ్యాస్, నిత్యావసర ధరలు, ప్రభుత్వరంగ సంస్థల అమ్మకాలు, నిరుద్యోగం, ద్రవ్యోల్బణం వంటి అనేకానేక విషయాల్లో నిరసలను తెలిపి నాటి ప్రభుత్వాలను తూర్పారా బట్టిన మోడీ బృందం ఇప్పుడు అంతకు వేయింతలు ఎక్కువే చేస్తోంది. మోడీ పాలనా వైఫల్యానికి ఇప్పుడు ఈ రంగాలన్ని ప్రబల సాక్షాలుగా నిలిచాయి. అధికార కాంక్ష పెరిగింది. అధికారంలో ఉండడం ఒక ఎత్తయితే దేశాన్ని మొత్తంగా గుప్పిట్లో పెట్టుకోవాలన్న రాజ్యకాంక్ష బిజెపి నేతల్లో పెరిగింది. మోడీ సర్కార్ దేశాన్ని పాలించడం కంటే... వివిధ రాష్ట్రాల్లో అధికారంలో ఉన్న తమ వ్యతిరేక ప్రభుత్వాలను కూల్చడం మీదనే ఎక్కువ శ్రద్ధ పెట్టింది. పెరుగుతున్న ధరలను నియంత్రించే పనిని పక్కన పెట్టి దేశంలో ఎక్కడ ఏ ఎన్నిక జరిగినా తామే గెలవాలనే తలంపుతో అడ్డదారులు తొక్కడానికే అధిక ప్రాధాన్యత ఇస్తోంది. ఒక వైపు డీజిల్, పెట్రోల్, గ్యాస్ ధరలు చుక్కలను అంటుతున్నాయి. సామాన్య, మధ్యతరగతి వర్గాలకు బతుకు భారం అయింది. వారి కొనుగోలు శక్తి రోజురోజుకు పడిపోతోంది. నిత్యావసర ధరలు రోజురోజుకు పెరగడంతో సామాన్యుడిది మూలిగే నక్క మీద తాటికాయ పడ్డ చందంగా మారింది. ఒక్క మాటలో చెప్పాలంటే దేశ ఆర్థిక పరిస్థితులను మోడీ ప్రభుత్వం గాలికి వదిలేసింది. దేశ ఆర్థిక పరిస్థితులను ఎదుర్కొనేందుకు, సంక్షోభం నుంచి దేశాన్ని గట్టెక్కించేందుకు తీసుకోవాల్సిన చర్యల మీద మోడీ దృష్టి కేంద్రీకరించడంలేదు. అందుకే మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, రైతాంగ, ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా మార్చి 26న భారత్‌బంద్ నిర్వహించాల్సిందిగా రైతు సంఘాలు పిలుపునిచ్చాయి. కేంద్ర కార్మిక సంఘాలు ఈ బంద్ పిలుపునకు మద్దతుగా నిలిచాయి. దేశవ్యాప్త బంద్‌లో భాగంగా ఆంధ్ర రాష్ట్రంలో బంద్‌ను విజయవంతం చేయాలని రాష్ట్ర రైతు, విశాఖ ఉక్కు పరిరక్షణ కమిటీలోని కార్మిక సంఘాల సదస్సు తీర్మానించింది. అనేక విద్యార్థి, యువజన సంఘాలు ఇప్పటికే ఈ బంద్‌కు మద్దతుగా అనేక ఆందోళనలను నిర్వహించాయి. వామపక్ష పార్టీలు ఈ బంద్‌కు మద్దతుగా ప్రత్యక్ష కార్యాచరణలో పాల్గొనాలని నిర్ణయించాయి. ఇక విశాఖ ఉక్కు పరిశ్రమ కోసం ఆనాటి కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా సమైక్య రాష్ట్ర ప్రజలు పెద్ద పోరాటం చేసి ఉక్కును సాధించారు. ఆనాటి ఉద్యమంలో 32 మంది ప్రాణాలు కోల్పోయి అమరులయ్యారు. వందలాది మంది తమ భూములను అప్పనంగా కట్టబెట్టారు. ఇది పూర్తిగా సెంటిమెంటుతో కూడుకున్న వ్యవహారం. దీనిని కాలరాస్తూ తెగనమ్మేస్తామని ప్రకటించారు. విశాఖ ఉక్కును కాపాడుకోవాలి. బంద్‌ను విజయవంతం చేయడం ద్వారా కుహనా జాతీయవాదులకు, వారి అంధ భక్తులకు తగిన సమాధానం చెప్పాలని కార్మిక లోకం బంద్‌కు మద్దతు పలికింది. ఇకపోతే మోడీ ప్రభుత్వం చేసిన మూడు వ్యవసాయ చట్టాలు రైతాంగానికి, ప్రజలకు తీవ్రమైన నష్టాన్ని కలిగిస్తాయి. కార్పొరేట్ కంపెనీలకు లక్షలకోట్ల విలువ చేసే వ్యవసాయ ఉత్పత్తుల కొనుగోలు మార్కెట్లను అప్పగించడమే ఈ చట్టాల ధ్యేయం. క్రమబద్ధమైన మార్కెట్ యార్డులు లేకుండా చేయడం వల్ల రైతులు తమ ఉత్పత్తులను కారు చౌకగా అమ్ముకోవాల్సిన దుస్థితి ఏర్పడుతుంది. ఈ చట్టాల్లో మద్దతు ధర మాటే లేకుండటం బిజెపి ప్రభుత్వ రైతు వ్యతిరేక కుట్రకు నిదర్శనంగా రైతులు ఢిల్లీ సరిహద్దుల్లో నాలుగు నెలలుగా ఆందోళనలు చేస్తున్నారు. ప్రభుత్వం తమ ఆందోళనలను పట్టించుకోవడం లేదు సరికదా బుల్‌డోజింగ్ విధానాలకు నిరసనగా రైతు సంగాలు ఏకమై బంద్‌కు పిలుపునిచ్చాయి. ఇకపోతే ఈ మధ్యకాలంలో గతంలో ఎప్పుడూ లేనంతగా మోడీ ...భావోద్వేగాలను పెంచే వాటి మీదనే ఎక్కువ మనసు పెట్టారు. తద్వారా ప్రజల దృష్టిని పక్కదారి పట్టించి పబ్బం గడుపుకోవాలని చూస్తున్నారు. దీంతో ప్రజలు పడుతున్న కష్టాలపై ఎక్కడా మాట్లాడడం లేదు. చాయ్‌వాలాకు నిజంగా ప్రజల కష్టాలు తెలియాలి. కానీ ఆయన కార్పోరేట్ చాయ్‌వాలాగా మారారు. దేశ ఆర్థిక పరిస్థితులను గటెక్కించడానికి,పేద మధ్య తరగతి వర్గాలను ఆర్థిక ఇబ్బందుల నుంచి బయటపడే యడానికి తీసుకోవాల్సిన చర్యలపై దృష్టి పెట్టడం లేదు. కరోనా మహమ్మారి కారణంగా అనేక దేశాలు లాక్‌డౌన్‌ను దృష్టిలో ఉంచుకొని దారిద్యరేఖ దిగువన నివసించే వారికి నేరుగా నగదు బదిలీ చేసి వారికి కొనుగోలు శక్తిని కలిపించాయి. తద్వారా మార్కెట్‌లో డిమాండ్‌ను పెంచాయి. ఉపాధి అవకాశాలు దెబ్బ తినకుండా జాగ్రత్త పడ్డాయి. లాక్‌డౌన్ తరువాత అన్ని రంగాలు పుంజుకునేందుకు ప్రోత్సాహకాలు ఇచ్చాయి. మోడీ సర్కార్ మాత్రం ఇవేవీ పట్టించుకోలేదు. పైగా సామాన్యుడి మీద భారం వేసే పని పెట్టు కుంది.గ్యాస్, డీజిల్, పెట్రోల్ ధరలతోపాటు నిత్యావసర సరుకుల ధరలను పెంచి ప్రజల నడ్డివిరిచే ప్రయత్నం చేసింది. కానీ ఈ సమస్యలతో విసిగిపోయిన ప్రజలు మోడీ పాలనాతీరును ఏవగించు కుంటున్నారు. తమకు న్యాయం జరగడం లేదని ఆక్రోశిస్తున్నారు. అందుకే బంద్ ద్వారా తమ ఆక్రందనలను తెలపాలని చూస్తున్నారు. ఈ బంద్‌తో అయినా ప్రభుత్వం కళ్లు తెరిచి ప్రజలవైపు చూస్తే మంచిది. లేకుంటే ప్రజలు తమ ఆయుధాలను ఎప్పుడు ఎలా ఎక్కడ వాడాలన్నది

ప్రభుత్వ ఆర్థిక మద్దతు పథకాల లక్ష్యసాధనకు బ్యాంకర్లు సహకరించాలి..!!

-మంజూరైన యూనిట్లన్ని గ్రౌండింగ్ అయ్యేలా చొరవ తీసుకోవాలి.
- బ్యాంకర్ల సమావేశం లో మాట్లాడిన అదనపు కలెక్టర్ రాజర్షి షా .

సంగారెడ్డి, మార్చి 25 (నేటినిజం ప్రతినిధి)బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా బ్యాంకర్ల సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజర్షి మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ ఆర్థిక మద్దతు పథకాలను లబ్ధిదారులకు అందించడానికి బ్యాంకర్లు తమ వంతు పూర్తి సహకారం అందించాలన్నారు. పెండింగ్ యూనిట్లను వేగవంతంగా నిర్ణీత గడువులోగా గ్రౌండింగ్ పూర్తిచేయాలని సూచించారు.

బ్యాంకర్లు ఆయా యూనిట్లను గ్రౌండ్ చేసినప్పుడు సంబంధిత శాఖ జిల్లా అధికారికి సమాచారం ఇవ్వాలని సూచించారు. బ్యాంకర్ల సహకారంతో స్వయం సహాయక సంఘాలకు ఇస్తున్న బ్యాంక్ లింకేజీ రుణాలలో జిల్లా ఐదవ స్థానంలో ఉందని తెలిపారు.

లబ్ధిదారులు తీసుకున్న రుణాలకు సంబంధించి న చెల్లింపులను బ్యాంకులకు సక్రమంగా చెల్లించేలా ఆయా శాఖల అధికారులు చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు.

వీధి వ్యాపారులకు అందిస్తున్న రుణాల లక్ష్యాన్ని ఈ నెలాఖరులోగా పూర్తి చేయాలని బ్యాంకర్లను కోరారు. ఎలాంటి జాప్యం లేకుండా ఆయా శాఖల అధికారులు, బ్యాంకర్లు సమన్వయంతో పని చేయాలని కోరారు.ఈ సమావేశంలో ఎల్ డి ఎం ప్రభాకర్ రెడ్డి, సంక్షేమ శాఖల అధికారులు, డి ఆర్ డి ఎ, మెప్మా, మున్సిపల్ కమిషనర్లు, వివిధ బ్యాంకుల బ్రాంచి మేనేజర్లు తదితరులు పాల్గొన్నారు.

భారత్‌బంద్‌కు లారీ ఓనర్స్ అసోసియేషన్ మద్దతు

అమరావతి,మార్చి25(ఆర్ఎన్ఎ): కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన మూడు నల్ల చట్టాలను రద్దు చేయాలని, విశాఖ స్టీల్ ప్లాంటు ప్రైవేటీకరణను వ్యతిరేకంగా చేపట్టనున్న భారత్ బంద్‌కు ఆంధ్రప్రదేశ్ లారీ ఓనర్స్ అసోసియేషన్ మద్దతు ప్రకటించింది. ఈ బంద్ సందర్భంగా లారీలను ఎక్కడికక్కడే నిలుపుదల చేస్తున్నట్లు అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వైవి ఈశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే ఎపి విద్యుత్ ఉద్యోగుల జెఎసి కూడా భారత్ బంద్‌కు సంపూర్ణ మద్దతు ప్రకటించింది. బంద్ సందర్భంగా ఎక్కడికక్కడే మధ్యాహ్నం ఆందోళనలు నిర్వహించాలని జెఎసి చైర్మన్ చంద్రశేఖర్ రాష్ట్రంలోని విద్యుత్ ఉద్యోగులకు విజ్ఞప్తి చేశారు. కేంద్ర ప్రభుత్వం దిగొచ్చే వరకూ ఈ ఆందోళనలకు తమ మద్దతు ఉంటుందని వారు తెలిపారు.

మంచిర్యాల జిల్లాలో దారుణ ఘటన

-ఒకే కుటుంబానికి చెందిన నలుగురు ఆత్మహత్య

మంచిర్యాల,మార్చి25(ఆర్ఎన్ఎ): జిల్లాలో దారుణ ఘటన చోటు చేసుకుంది. అప్పుల ఊబిలో కూరుకున్న కారణంగా ఒకే కుటుంబానికి చెందిన నలుగురు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఇద్దరు పిల్లలతో సహా దంపతులు బలవన్మరణానికి పాల్పడ్డారు. ఈ విషాద ఘటన కాసిపేట మండలం మల్కపల్లిలో గురువారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన రమేశ్, పద్మ దంపతులు గదిలో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డారు. మరో గదిలో వారి కొడుకు అక్షయ్ (17), కూతురు సౌమ్య (19) మృతదేహాలున్నాయి. అయితే ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు. అయితే, కూతురు సౌమ్య ఇటీవల అత్తవారింటి నుంచి పుట్టింటికి వచ్చింది. సౌమ్య అత్తవారింటి నుంచి వచ్చి పుట్టింట్లో తల్లిదండ్రులు, సోదరుడితో కలిసి ఆత్మహత్యకు పాల్పడడం అనుమానాలకు తావిస్తోంది. ఒకే కుటుంబానికి చెందిన నలుగురు ఆత్మహత్యకు పాల్పడడంతో జిల్లాలో సంచలనంగా మారగా.. గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాలను పరిశీలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఉయ్యాలవాడ పేరు ప్రకటనతో పులకించా

ట్విట్టర్ వేదికగా సిఎం జగన్‌ను అభినందించిన చిరంజీవి

అమరావతి,మార్చి25(ఆర్ఎన్ఎ): కర్నూలు జిల్లా ఓర్వకల్లు ఎయిర్‌పోర్టుకు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి పేరును ప్రకటించడం పట్ల మెగాస్టార్ చిరంజీవి హర్షం వ్యక్తం చేశారు. భారత స్వాతంత్ర్య సమరయోధుడికి సముచిత గౌరవం కల్పిస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకున్న నిర్ణయం ఆనందం కలిగించిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సొంతంగా నిర్మించిన ఓర్వకల్లు ఎయిర్‌పోర్టును కేంద్రమంత్రి పి హర్‌దీప్‌సింగ్‌తో కలిసి సీఎం జగన్ గురువారం ప్రారంభించి, జాతికి అంకితం చేశారు. ఈ సందర్భంగా ఓర్వకల్లు ఎయిర్‌పోర్టునకు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి పేరును సీఎం జగన్ ప్రకటించారు.

ఈ విషయంపై ట్విటర్ వేదికగా స్పందించిన చిరంజీవి.. గౌరవనీయులైన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ప్రకటనతో ఆనందంలో మునిగితేలుతున్నా. భారత ప్రథమ స్వాతంత్ర్య సమరయోధుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి.. గొప్ప దేశభక్తుడు, నిజమైన యోధుడు.. ఆయన ఈ గుర్తింపునకు పూర్తి అర్హుడు. అలాంటి గొప్ప వ్యక్తి పాత్ర పోషించే అవకాశం లభించడం నిజంగా నా అదృష్టం' అని సంతోషం వ్యక్తపరిచారు. రేనాటి వీరుడు.. తొలి స్వతంత్ర సమర యోధుడు.. ఉయ్యాలవాడ నరసింహా రెడ్డి జీవితం ఆధారంగా తెరకెక్కిన 'సైరా' సినిమాలో మెగాస్టార్ ప్రధాన పాత్రలో నటించిన విషయం తెలిసిందే.

వ్యవసాయ, కార్మిక చట్టాలతో నిరంకుశ విధానాలు

నెలలతరబడి ఆందోళనలు చేస్తున్నా పట్టించుకోని ప్రభుత్వం
బంద్‌కు మద్దతు ఇవ్వడం ద్వారా సమస్యలపై పోరాటం

న్యూఢిల్లీ,మార్చి25(ఆర్ఎన్ఎ): వ్యవసాయ ఉత్పత్తులను కారుచౌకగా కొనుగోలు చేసి గోదాముల్లో భారీగా నిల్వ చేసుకోవడానికి ఈ చట్టాలు కంపెనీలకు హక్కునిస్తున్నాయని రైతు సంఘాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. దీని వలన నిత్యావసర సరుకుల ధరలు పెరిగి ప్రజలపై భారాలు పడతాయి. ఆహార భద్రతకు ముప్పు వాటిల్లుతుంది.

ధరలు ఎంత పెరిగినా రాష్ట్ర ప్రభుత్వాలు, విజిలెన్స్ శాఖ, పోలీసులు గోదాముల జోలికి పోరాదని ఈ చట్టాలు నిర్దేశిస్తున్నాయి. తద్వారా సరుకుల కృత్రిమ కొరతను సృష్టించి ధరలు పెంచి విపరీతంగా లాభాల వంట పండించుకోవడానికి కార్పొరేట్ కంపెనీలకు అవకాశం ఏర్పడుతోంది. కాంట్రాక్ట్ వ్యవసాయం పేరిట కార్పొరేట్ వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తూ రైతులు తమ సొంత పొలాల్లో పాలేర్లుగా పనిచేసే విధానాన్ని ఈ చట్టాలు సృష్టిస్తాయి. అందుకే రైతాంగం, వ్యవసాయ నిపుణులు, అభ్యుదయ మేధావులు ఈ చట్టాలను వ్యతిరేకిస్తున్నారు. అయితే కార్పొరేట్లకు ఊడిగం చేయడమే లక్ష్యంగా దేశాన్ని పాలిస్తున్న నరేంద్ర మోడీ, బిజెపి పాలకులు... ప్రజల నుంచి వెలువడుతున్న వ్యతిరేకతను ఏమాత్రం లెక్కచేయడంలేదు. తమ దుర్మార్గపు విధానాలను బలవంతంగా దేశంపై రద్దుతున్నారు.ప్రజలు తమ మీద పడుతున్న భారాన్ని మౌనంగా భరించాలని సామాజిక మాధ్యమాల ద్వారా సందేశాలను ఇప్పిస్తోందని మండిపడుతున్నారు. ఇంతటి దివాలాకోరు ప్రభుత్వాన్ని దేశ ప్రజలు ఎప్పుడూ చూడలేదని అంటున్నారు.

సామాన్యుడు మొర పెట్టుకుంటుంటే మోడీ సర్కార్ జాతీయతనో, మతమనో మరొకటనో అంటుంటే ప్రజలకు పట్టడం లేదు. 'ముందు మా కడుపు నింపండి. లేదంటే చచ్చిపోతామ'ని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వారి ఆర్తనాదాలు, ఆకలి కేకలు మోడీ సర్కార్ చెవులకు తాకడం లేదన్నారు. ఒక వైపు ప్రజల మీద భారం వేస్తూనే మరో వైపు ప్రభుత్వ రంసంస్థలను పప్పుబెల్లాలకు తమకు అనుకూలంగా ఉండే ఒకరిద్దరు బడా బాబులకు కట్టబెట్టే ప్రయత్నం చేస్తున్నారు. ఎల్ఐసి, బ్యాంకులు, రైల్వేలతో పాటు అన్ని ప్రముఖ ప్రభుత్వ రంగ సంస్థలను ప్రయివేటు సంస్థలకు అప్పచెప్పేందుకు సిద్ధం అవుతోంది. దీనితో ఆయా సంస్థలలో పని చేసే ఉద్యోగులలో ఆగ్రహ జ్వాలలు రగులుతున్నాయి. ఇప్పటికే మోడీ ప్రభుత్వం తీసుకొచ్చిన వ్యవసాయ చట్టాలకు వ్యతిరేకంగా రైతులు పట్టుదలతో సుదీర్ఘ కాలంగా ఢిల్లీ సరిహద్దులలో ఆందోళన చేస్తున్న విషయం మనందరికి తెలిసిందే.

మరో వైపు రాజ్యాంగ స్ఫూర్తికి భిన్నంగా ఫెడరల్ విధానాలకు తిలోదకాలు ఇస్తూ రాష్ట్రాల హక్కులను హరించేలా చట్టాలను తేవడంపై కూడా ప్రాంతీయ పార్టీలు మోడీ సర్కారుపై గుర్రుగా ఉన్నాయి. మోడీ రెండోసారి ప్రధానిగా బాధ్యతలు చేపట్టాక అనుసరిస్తున్న విధానాలన్నీ మరింత ప్రజా వ్యతిరేకమైనవిగా ఉంటున్నాయి. రైతుల ఆందోళన ఉధృతంగా సాగుతున్న పట్టించుకోవడం లేదు. తాజా పరిస్థితులు చూస్తుంటే త్వరలో జరిగే నాలుగు రాష్ట్రాల్లో బిజెపి గెలుపు అంత సులభం కాదని సర్వేలు, విశ్లేషణలు తెలియజేస్తున్నాయి. కార్పొరేట్ల సేవలో భాగంగా నరేంద్ర మోడీ ప్రభుత్వం ఇటీవల కార్మిక సంస్కరణలను మరింత వేగంగా అమలు చేస్తున్నది.దేశంలోని కార్మికవర్గం అనేక పోరాటాల ద్వారా, త్యాగాల ద్వారా సాధించుకున్న కార్మిక చట్టాలన్నింటినీ రద్దు చేస్తూ వాటి స్థానంలో నాలుగు లేబర్ కోడ్లను పార్లమెంట్‌లో ఎలాంటి చర్చ లేకుండా తన మంద బలంతో ఆమోదింపచేసింది. పాత కార్మిక చట్టాల్లో కార్మికులకు అంతో ఇంతో ప్రయోజనాన్ని కూడా ప్రస్తుత లేబర్ కోడ్లలో తొలగించేసింది. కార్మిక శాఖకు ఎగ్జిక్యూటివ్ అధికారాలను తొలగించింది. కార్మికులు, ఉద్యోగులు ఎప్పటికీ పర్మినెంట్ కాని పద్ధతిలో 'ఫిక్స్‌డ్ టర్మ్ ఎంఎ÷-లాయిమెంట్' అమల్లోకి వచ్చింది. పారిశ్రామిక ప్రమాదాల్లో కూడా యజమానులకు బాధ్యత లేకుండా కోడ్‌లు రూపొందించింది. వీటన్నింటికి ఎదరించడానికే భారత్ బంద్‌కు పిలుపునిచ్చామాని వ్యవసాయ, కార్మిక సంఘాల నేతలు చెప్పారు.

ఇక కేంద్రం గుప్పిట్లోకి ఢిల్లీ

నామమాత్రం కానున్న అసెంబ్లీ
కేజ్రీవాల్‌ను దెబ్బకొట్టడం కోసం చట్టంలో మార్పు

న్యూఢిల్లీ,మార్చి25(ఆర్ఎన్ఎ): ప్రజాస్వామ్యం అర్థం మారుతోంది. ఎన్నికైన ప్రభుత్వాలకు విలువ లేకుండా పోతోంది. ఇప్పుడు నరేంద్రమోడీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం అర్థం మార్చేసింది. కేంద్ర పాలిత ప్రాంతాల్లో ప్రభుత్వాలను డమ్మాలను చేస్తూ కొత్త చట్టం తీసుకు వచ్చింది. ముందుగా ఢిల్లీకే ఈ చట్టం అన్వయిస్తున్నప్పటికీ.. తర్వాత. దేశం మొత్తం విస్తరించడానికి ఇదో గొప్ప అవకాశంగా ఉపయోగ పడుతుందన్న ఆందోళన నెలకొంది. ఢిల్లీలో ప్రభుత్వం అంటే లెఫ్టినెంట్ గవర్నరే అన్న అర్థం వచ్చేలా కొత్త చట్టం తీసుకు వచ్చారు. 'నేషనల్ క్యాపిటల్ టెరిటరీ ఆఫ్ ఢిల్లీ-2021' బిల్లు ఉభయసభల్లో ఆమోదం పొందింది. దీంతో ఇక ఢిల్లీలో ఎన్నికైన ప్రభుత్వం ఇక నామమాత్రంగా ఉంది. కేజ్రీవాల్‌ను ఎదుర్కోలేక పోతున్న తరుణంలో ఈ బిల్లును తీసుకుని రావడం గమనార్హం. ఢిల్లీలో ప్రజా ప్రభుత్వాన్ని ఇక నామమాత్రం చేయడం వెనక దాగివున్న కుట్ర తెలియందికాదు. . కేంద్ర పాలితప్రాంతాల్లో ఇప్పటికే ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వానికి చుక్కలు చూపెట్టేలా లెఫ్టినెంట్ గవర్నర్లకు అధికారాలు ఉన్నాయి. ఇప్పుడు కొత్త చట్టంద్వారా అసలు ప్రభుత్వం అంటేనే... లెఫ్టినెంట్ గవర్నర్ అన్న నిర్వచనం మార్చేశారు. ఇక నుంచి లెఫ్టినెంట్ గవర్నర్ కూడా పాలనాధికారే, ప్రభుత్వ రోజువారీ వ్యవహారాల్లో ఆయనకు జోక్యం చేసుకునే హక్కు ఉంటుంది. అంటే ప్రజాప్రభుత్వం దాదాపుగా నిర్వీర్యం అయిపోయినట్లేనన్నమాట. కేంద్ర, రాష్ట్రాల్లో ఒకే ప్రభుత్వం ఉంటే సమస్య ఉత్పన్నం కాదు. ఢిల్లీలో ఆప్ సర్కార్ ఉండి.. కేంద్రంలో బీజేపీ లాంటి సర్కార్ ఉంటే మాత్రం..లెఫ్టినెంట్ గవర్నర్ ద్వారా బీజేపీనే పరిపాలన చేస్తుంది. ఈ బిల్లును ఒక్క బీజేపీ మినహా దాదాపుగా అన్ని పార్టీలు వ్యతిరేకించాయి. దీంతో రాజ్యసభలో పాస్ కాదని అందరూ అనుకున్నారు. బీజేడీ, వైఎస్సీ పార్టీలు బిల్లుపై తీవ్ర విమర్శలు చేశాయి. ఏదైతేనేమీ దేశ రాజధాని దిల్లీలో లెఫ్టినెంట్ గవర్నర్‌కు మరిన్ని అధికారాలు కట్టబెట్టే కీలక బిల్లుకు రాజ్యసభ ఆమోదం తెలిపింది. విపక్షాల ఆందోళన మధ్య అధికార పార్టీ ఈ బిల్లును నెగ్గించుకుంది. ఈ బిల్లు ప్రకారం ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వం తీసుకునే నిర్ణయాలు వేటికైనా ఎల్జీ ఆమోదం తప్పనిసరి. బిల్లుపై చర్చ సందర్భంగా విపక్ష సభ్యులు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారని దుయ్యబట్టారు. బిల్లును సెలెక్ట్ కమిటీకి పంపించాలని డిమాండ్ చేశారు. ఈ క్రమంలో కాంగ్రెస్ పార్టీ వాకౌట్ చేసింది. బిల్లుతో భారత రాజ్యాంగానికి జరిగిందని ఆమ్ ఆద్మీ పార్టీ నేత సంజయ్ సింగ్ విమర్శించారు. రెండు కోట్ల మంది ఎన్నుకున్న ప్రభుత్వం చేసిన తప్పేంటని ప్రశ్నించారు. పాలన వ్యవహారాల్లో నెలకొన్న అస్పష్టతను తొలగించేందుకు ఈ బిల్లు తెచ్చామని కేంద్ర సర్కారు చెబుతోంది. ప్రజాస్వామ్యానికి చీకటి రోజని ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజీవ్రాల్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజా ప్రభుత్వానికి అధికారాన్ని తిరిగి పునరుద్ధరించేందుకు తమ పోరాటం కొనసాగుతుందని అన్నారు. కేంద్రం ఎన్ని అడ్డంకులు సృష్టించిన, ప్రజల సంక్షేమానికి కట్టుబడి ఉంటామని, తమ బాధ్యతలను కొనసాగిస్తామని, ఆ బాధ్యతలు ఆగవు, మందగించవని ట్వీట్ చేశారు. ఢిల్లీ ప్రజలు ఎనున్నుకున్న ప్రజాస్వామ్య ప్రభుత్వ హక్కులను లాక్కొని ఎల్‌జికి అప్పగించడమేమిటీ.. ఇదెక్కడి విడ్డూరమని ఉప ముఖ్యమంత్రి మనీష్ సిసోడియా మండిపడ్డారు.

జానారెడ్డిపై టీఆర్ఎస్ ఎమ్మెల్యే బాల్క సుమన్ ఫైర్

సామంతరాజు తరహాలో జానారెడ్డి ఏలారు
సాగర్ నియోజకవర్గానికి ఆయన చేసిందేమీ లేదు
బిజెపికి డిపాజిట్ దక్కకుండా చేయాలి

నల్లగొండ,మార్చి25(ఆర్ఎన్ఎ): మరోమారు ఎమ్మెల్యే పదవి కోసం కాంగ్రెస్ సీనియర్ నేత జానారెడ్డి తగుదునమ్మా అంటూ వస్తున్నారని టీఆర్ఎస్ ఎమ్మెల్యే బాల్క సుమన్ నిప్పులు చెరిగారు. నాగార్జున సాగర్ నియోజకవర్గ అభివృద్ధికి జానారెడ్డి చేసేందేమీ లేదన్నారు. ఉమ్మడి ఎపిలో ఆంధ్రా నాయకుల

అడుగులకు మడుగులు ఒత్తిన వీరంతా ఇప్పుడు ప్రశ్నిస్తామంటూ బయలుదేరారని మండిపడ్డారు. టిఆర్ఎస్ పార్టీ పట్ల నాగార్జున సాగర్ ప్రజలు మంచి ఆదరణ చూపుతున్నారని టీఆర్ఎస్ ఎమ్మెల్యే స్పష్టం చేశారు. నల్లగొండ జిల్లాలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో బాల్క సుమన్ మీడియాతో మాట్లాడారు.

నాగార్జున సాగర్ ఉప ఎన్నికల్లో టీఆర్ఎస్ పార్టీని ప్రజలు ఆదరిస్తారన్న విశ్వాసం ఉందన్నారు. బ్రహ్మాండమైన భారీ మెజార్టీతో టీఆర్ఎస్ పార్టీ గెలువబోతుందని చెప్పారు. సాగర్ నియోజకవర్గం కాంగ్రెస్ హయాంలో ఏమాత్రం అభివృద్ధి చెందలేదు. టీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాతనే సాగర్ నియోజకవర్గం అభివృద్ధి చెందుతుందని స్థానికులు చెబుతున్నారు. సబ్బండ వర్గాలు టీఆర్ఎస్ పార్టీకి వెల్లువలా మద్దతు తెలుపుతున్నారు. ఏడు సార్లు ఎమ్మెల్యేగా, నాలుగుసార్లు మంత్రిగా పని చేసిన జానారెడ్డి.. ఈ నియోజక వర్గాన్ని పట్టించుకోలేదు. వెనుకబాటుకు గురి చేశారు. మండలానికో సామంతరాజును పెట్టుకుని నడిపించారు. బడుగు, బలహీన వర్గాలను జానారెడ్డి దగ్గరకు రానివ్వలేదు. ఆ సామంతరాజులే చెప్పిందే జానారెడ్డికి వేదం అన్నారు. 1400 బెడ్‌రూం ఇండ్లను సాగర్‌కు మంజూరు చేస్తే.. పేద వర్గాలకు కట్టించి ఇవ్వలేదు. ఇటీవలే పలు ఇరిగేషన్ ప్రాజెక్టులకు సీఎం కేసీఆర్ శంకుస్థాపన చేశారు. హాలియాలో డిగ్రీ కాలేజీ పనులు జరుగుతున్నాయి. విద్యుత్ వ్యవస్థను కూడా మెరుగుపరుస్తున్నాం. తండాలకు పూర్తిగా రాజ్యాధికారం కల్పించాం. మిషన్ భగీరథ కింద అన్ని గ్రామాలకు సురక్షితమైన తాగునీరు సరఫరా చేస్తున్నాం. మొత్తంగా టీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమ ప్రభుత్వంగా విరాజిల్లుతుందన్నారు. జానారెడ్డి రాచరిక పాలన కొనసాగించారు. జానారెడ్డి పరిపాలనను, దివంగత ఎమ్మెల్యే నోముల పరిపాలనను ఒకసారి సరిపోల్చుకోవాలన్నారు. ప్రజల ఆశీర్వాదంతో మరోసారి అధికారంలోకి రాబోతున్నాం. నాగార్జున సాగర్‌ను ఇప్పటికే అన్నివిధాలా అభివృద్ధి చేశాం.. మరింత అభివృద్ధికి ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. అభివృద్ధి సీఎం కేసీఆర్ వల్లే సాధ్యమవుతుందన్నారు. ఇక్కడి ఎస్సీ,ఎస్టీలను ఆదరించి వారికి పథకాలు అమలు చేసిన ఘనత టిఆర్ఎస్‌దన్నారు. రెండు జాతీయ పార్టీలు తెలంగాణకు నష్టం కలిగిస్తున్నారు. సామాన్యుడి నడ్డి విరిచే విధంగా కేంద్ర ప్రభుత్వం వ

సుప్రీం జడ్జి ఎన్‌వి రమణపై సిఎం జగన్ ఫిర్యాదులు

-తోసిపుచ్చిన సుప్రీం కోర్టు..ప్రకటన విడుదల

న్యూఢిల్లీ,మార్చి25(ఆర్ఎన్ఎ): సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎన్‌వీ రమణపై ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి చేసిన ఫిర్యాదును సుప్రీంకోర్టు తోసిపుచ్చింది. అమరావతి భూముల విషయంలో చేసిన ఈ ఫిర్యాదుపై నిబంధనల ప్రకారం ఇన్-హౌస్ విచారణ జరిపినట్లు సుప్రీంకోర్టు బుధవారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపింది. తదుపరి సిజెగా ఎన్‌వి రమణ నియమితులు కాబోతున్న తరుణంలో ఈ ప్రకటన విడుదల కావడం గమనార్హం. సుప్రీంకోర్టు విడుదల చేసిన ప్రకటనలో తెలిపిన వివరాల ప్రకారం, అమరావతి భూముల విషయంలో జస్టిస్ ఎన్‌వీ రమణపై ఆంధ్ర ప్రదేశ్ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి 2020 అక్టోబరు 6న సుప్రీంకోర్టుకు ఫిర్యాదు చేశారు. దీనిపై ఇన్-హౌస్ ప్రొసీజర్‌లో విచారణ జరిపి, తగిన విధంగా పరిశీలించి, సుప్రీంకోర్టు తోసిపుచ్చింది. ఈ ఇన్-హౌస్ ప్రొసీజర్ అత్యంత రహస్యమైనది, ఈ వివరాలు బహిరంగంగా వెల్లడించదగినవి కాదు. ఈ ఆరోపణలను అఫిడవిట్ ద్వారా కూడా జగన్ సుప్రీంకోర్టుకు సమర్పించారు. ఇదిలావుండగా, భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ ఎస్‌ఏ బాబ్డే వచ్చే నెలలో పదవీ విరమణ చేయబోతున్నారు. తదుపరి సీజేఐగా జస్టిస్ ఎన్‌వీ రమణను నియమించాలని జస్టిస్ బాబ్డే కేంద్ర ప్రభుత్వానికి బుధవారం సిఫారసు చేశారు. రాష్ట్రపతి ఆమోదం తర్వాత ఏప్రిల్ 24న జస్టిస్ రమణ సీజేఐగా ప్రమాణ స్వీకారం చేస్తారు.

బీడ్ జిల్లాలో సంపూర్ణ లాక్‌డౌన్

కరోనా కేసులతో మహా సర్కార్ నిర్ణయం

మార్చి 26 నుంచి ఏప్రిల్ 4వ తేదీ వరకు అమలు

ముంబై,మార్చి25(ఆర్ఎన్ఎ): మహారాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. కరోనా కేసులు భారీ సంఖ్యలో పెరుగుతుండడంతో మార్చి 26 నుంచి ఏప్రిల్ 4వ తేదీ వరకు బీడ్ జిల్లాలో సంపూర్ణ లాక్‌డౌన్ ప్రకటించింది. ఫంక్షన్ హాళ్లు, హోటల్స్, రెస్టారెంట్స్ మూసివేయాలని ఆదేశాలు జారీ చేసింది. వీటితో పాటు స్కూళ్లు, కాలేజీలు కూడా తెరిచే అవకాశం లేదని స్పష్టం చేసింది. అయితే నిత్యవసరాల సరుకులు, మెడికల్ షాపులకు ఈ లాక్‌డౌన్ నుంచి మినహాయింపు లభించింది. గత సంవత్సరం నవంబర్ నుంచి కరోనా కేసులు తగ్గుముఖం పట్టినప్పటికీ వారం రోజుల నుంచి కేసులు తీవ్ర స్థాయిలో పెరుగుతున్నాయి. దీంతో కొన్ని రాష్ట్ర ప్రభుత్వాలు ముందు జాగ్రత్తగా విద్యాసంస్థలు మూసివేయాలని నిర్ణయించాయి. అయితే దేశంలో నమోదైన మొత్తం కేసుల్లో ఎక్కువగా మహారాష్ట్ర నుంచే ఉండడం గమనార్హం.

ఆజాదీకా అమృత్ మహోత్సవం

-నగరంలో 3కె రన్ ప్రారంభించిన సిఎస్

హైదరాబాద్,మార్చి25(ఆర్ఎన్ఎ): 75 సంవత్సరాల స్వతంత్ర ఉత్సవాల్లో భాగంగా ఆజాదీ కా అమృత్ మహోత్సవం పేరుతొ నిర్వహిస్తున్న పలు కార్యక్రమాల్లో భాగంగా బుధవారం నెక్లెస్ రోడ్‌లోని పీపుల్స్ ప్లాజా 3 కే రన్ ను రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేశ్ కుమార్, డీజీపీ ఎం. మహేందర్ రెడ్డిలు జండా ఊపి ప్రారంభించారు. ఈ రన్‌లో పెద్ద ఎత్తున క్రీడాకారులు, యువతీ యువకులు, ఉద్యోగులు అధికారులు దాదాపు 3 వేలమంది పాల్గొన్నారు.పీపుల్స్ ప్లాజా నుంచి ప్రారంభమైన ఈ రన్ లుంబిని పార్క్, లక్ డీ కాపూల్, కంట్రోల్ రూమ్ మీదుగా ఎల్. బి. స్టేడియం వరకు చేరుకుంది. ఈ రన్ లో సీఎస్ సోమేశ్ కుమార్, డీజీపీ మహేందర్ రెడ్డి లు కొద్దీ దూరం పాల్గొన్నారు. సందర్భంగా సోమేశ్ కుమార్ మాట్లాడుతూ, భారత స్వతంత్ర పోరాట స్ఫూర్తిని దేశ ప్రజల్లో నింపేందుకు ఆజాదికా అమృత్ వర్క్ అనే పేరుతొ రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భారతదేశ ఘనమైన చరిత్ర, దేశ స్వతంత్ర పోరాటంలో సమర యోధులు చేసిన త్యాగాల గురించి భావితరాల వారికి తెలియజేసే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అన్ని వర్గాలను భాగస్వామ్యులను చేసి 75వ స్వతంత్ర ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. డీజీపీ మహేందర్ రెడ్డి మాట్లాడుతూ, ఎంతో మంది ప్రాణత్యాగాల ఫలితమే భారతదేశానికి స్వతంత్రం వచ్చిందని అన్నారు. ఈ స్వతంత్ర భారతదేశంలో ఎంతోమంది మేధావులు యువతీ యువకులు ఎన్నోకలలతో పుట్టినిల్లని భిన్నత్వంలో ఏకత్వంగా విరాజిల్లుతున్న దేశం మన భారత దేశం కొనియాడారు. భారత దేశానికి స్వాతంత్రం సిద్ధించిన విధానం, స్వాతంత్ర సమర యోధుల త్యాగాలను తెలుసుకోవడంతోపాటు, మహనీయుల జీవిత చరిత్రలు చదవాలని యువతకు సూచించారు. మహనీయుల త్యాగ ఫలితమే ప్రస్తుత స్వేచ్ఛా, స్వాతంత్రాలను అనుభవిస్తున్నామని, వారి త్యాగాలను ఎప్పుడూ మనం మరువ వద్దని తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు సీనియర్ ఐఏఎస్, ఐపీఎస్, ఐఎఫ్ఎస్ అధికారులు, వివిధ విభాగాల ఉన్నతాధికారులు, ఉద్యోగులు, వివిధ క్రీడల సంఘాల అధ్యక్షులు, క్రీడాకారులు, విద్యార్థిని, విద్యార్థులు, యువతీ, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఖాజీపేట కోచ్ ఫ్యాక్టరీ కోసం అసెంబ్లీ తీర్మానం చేయాలి

-అఖిపక్షం ధర్నాలో చాడ వెంకట్ రెడ్డి డిమాండ్

హైదరాబాద్,మార్చి25(ఆర్ఎన్ఎ): అసెంబ్లీలో కోచ్ ఫ్యాక్టరీపై తీర్మానం చెయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకట్ రెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం ఆయన ఇందిరా పార్క్ వద్ద అఖిలపక్షం నేతృత్వంలో జరిగిన ధర్నాలో మాట్లాడుతూ ముఖ్యమంత్రి కేసీఆర్ అన్ని పార్టీలను ఢిల్లీకి తీసుకెళ్లి ఒత్తిడి తేవాలన్నారు. కాజీపేట కోచ్ ఫ్యాక్టరీపై కొట్లాడే వాళ్ళకే రాబోయే కార్పొరేషన్ ఎన్నికల్లో ఓటు అడిగే హక్కు ఉందన్నారు. రైల్వే కోచ్ ఫ్యాక్టరీ సాధన కోసం పార్టీలకు అతీతంగా పోరాటం చేయాలని పిలుపు ఇచ్చారు. విభజన బిల్లులో ఉన్న అంశాన్ని కేంద్రం తుంగలో తొక్కిందని విమర్శించారు. విభజన హామీల అమలు కోసం కార్యాచరణ సిద్ధం కావాలని చాడ వెంకట్ రెడ్డి అన్నారు. రైల్వే కోచ్ ఇక్కడి వాళ్ల అందరి స్వప్నమని అరుణోదయ నేత విమలక్క తెలిపారు. తెలంగాణ ఉద్యమంలో రైల్ రోకో ఎంతో ఉపయోగపడిందన్నారు. ఢిల్లీలో జరిగే పోరాటంలోను అరుణోదయ టీమ్ మద్దతు ప్రకటించిందని విమలక్క తెలిపారు. తెలంగాణ సాధించుకున్నట్టే.. కోచ్ ఫ్యాక్టరీని సాధించుకుంటామని ఎమ్మెల్యే వినయ్‌భాస్కర్ స్పష్టం చేశారు. ఇది కేవలం వరంగల్ సమస్య కాదని యావత్ తెలంగాణదని వినయ్‌భాస్కర్ చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బి. వినోద్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేరాల నియంత్రణకు కఠిన చట్టాలు: సుచరిత

ఒంగోలు,మార్చి25(ఆర్ఎన్ఎ): మహిళలపై అఘాయిత్యాలు, రోడ్డు యాక్సిడెంట్లు మద్యపానం, మత్తుపదార్థాల వలన జరుగుతున్నాయని హోంశాఖ మంత్రి సుచరిత అన్నారు. గతంలో దురలవాట్లకు ఒక ఏజ్ లిమిట్ ఉండేది కానీ, ప్రస్తుతం స్కూల్స్ కి వెళ్లే వాళ్లు కూడా మందు, సిగరేట్లు తాగుతున్నారని పేర్కొన్నారు. చాప కింద నీరులా మాదకద్రవ్యాలు సమాజంలో విస్తరిస్తున్నాయన్నారు. మాదకద్రవ్యాలు అమ్మేవారిపై కఠిన చర్యలు తీసుకుని జైలులోనే ఉంచేందుకు చట్టాలు అవసరమన్నారు. ఏపిలో మాదకద్రవ్యాలు సరఫరా చేసేవారిని ఎస్ఈబి పట్టుకుంటోందన్నారు.

ఉపనిషత్తుల్లో మంచిమాట

తిరుమల,మార్చి25(ఆర్ఎన్ఎ): ఉపనిషత్తులో ఓ మాట ఉంది. నిత్యం ఏదో ఓ మంచి విషయాన్ని వింటూ ఉండాలి. చదువుతూ ఉండాలి. చదివినదాన్ని మననం చేసుకుంటూ ఉండాలి.ఎన్ని కష్టాలొచ్చినా సత్యాన్ని వదులుకోకూడదు. నైతికంగా పతనం కాకూడదు. నేను, నాది అన్న సంకుచిత భావనను వదిలిపెట్టాలి. చేసేవాడు, చేయించేవాడు ఆ భగవంతుడే అనుకుంటే- ఫలితాలమీద ఆపేక్ష ఉండదు.'మా, మేము, నా' అనే స్వార్థానికి కౌరవులు జీవితంలో మొదటిస్థానం ఇచ్చారు. రెండో స్థానం ప్రపంచానికి, మూడో స్థానం భగవంతుడికిచ్చారు. ఫలితం అందరికీ తెలిసిందే. పాండవులు తమ జీవితంలో మొదటి స్థానాన్ని భగవంతుడికి ఇచ్చారు. ద్వితీయ స్థానాన్ని నిస్వార్థ బుద్ధితో ప్రపంచానికిచ్చారు. తరవాత తమ గురించి ఆలోచించారు. అందుకే భారత యుద్ధంలో విజేతలయ్యారు. అందుకే మంచి ఆలోచనలు..మంచి పనులను..మంచి కార్యాలను చేయాలని అంటారు. ఇకపోతే శిశిర రుతువుకు ముగింపు పలికే ఫాల్గుణ మాసంలో వచ్చే ప్రతి తిథిలోనూ ఓ వ్రతం చేస్తారు. ఫాల్గుణ నెలలో శుక్ల పక్షమి చంద్రుని ప్రకాశవంతమైన పక్షం కాలం 'ద్వాదశి' అనగా పన్నెండవ రోజు, ఇంగ్లీష్ క్యాలెండర్ అనుసరిస్తున్నవారికి ఈ తేదీ ఫిబ్రవరి మధ్య నుండి మార్చి వరకు వస్తుంది. ఫాల్గుణ శుద్ధ ద్వాదశిని నృసింహ ద్వాదశి అంటారు.విష్ణు భక్తులకు గోవింద ద్వాదశి చాలా ముఖ్యం. ఈ రోజున హిందూ భక్తులు విష్ణువును సంతోషకరమైన , సంపన్నమైన జీవితం కోసం తన దైవిక ఆశీర్వాదం కోరుకుంటారు. విష్ణువు యొక్క 'నరసింహ' అవతారం ఈ రోజున పూజిస్తారు కాబట్టి గోవింద ద్వాదశి ని 'నరసింహ ద్వాదశి' గా కూడా జరుపుకుంటారు. ఈ పండుగ వేడుకలు పూరీలోని జగన్నాథ్ ఆలయంలో చాలా విస్తృతంగా మరియు ముఖ్యమైనవి. గోవింద ద్వాదశి ఉత్సవాలతో పాటు ద్వారక తిరుమల వెంకటేశ్వర స్వామి ఆలయం, తిరుమల తిరుపతి బాలాజీ ఆలయం విష్ణువు యొక్క ఇతర ప్రముఖ ఆలయాలలో కూడా ప్రసిద్ధి చెందింది.గోవింద ద్వాదశి నాడు, భక్తులు సాయంత్రం విష్ణు దేవాలయాలను సందర్శించి అక్కడ జరిగే పూజ ఆచారాలలో పాల్గొంటారు. విష్ణువు పేరు జపించడం 'శ్రీ నరసింహ కవచం' మంత్రాన్ని పఠించడం గోవింద ద్వాదశిపై చాలా అనుకూలమైనదిగా భావిస్తారు.

నర్సంపేటలో మిర్చి పరిశోధనా కేంద్రం ఏర్పాటు

నైపుణ్య శిక్షణా కేంద్రాలుగా రైతు వేదికలు

శాసనసభ ప్రశ్నోత్తరాల్లో మంత్రి నిరంజన్ రెడ్డి వెల్లడి

హైదరాబాద్,మార్చి25(ఆర్ఎన్ఎ): వరంగల్ రూరల్ జిల్లా నర్సంపేటలో మిర్చి పరిశోధనా కేంద్రాన్ని ఏర్పాటు చేస్తామని వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్ రెడ్డి హామీ ఇచ్చారు. దీనికి తగిన ఏర్పాట్లు జరుగుతున్నాయని అన్నారు. వ్యవసాయ పంటల అభివృద్ధి కోసం రాష్ట్రంలో నిరంతరంగా పరిశోధనలు జరుగుతున్నాయి. అందులో భాగంగానే వరికి బాన్సువాడలో, మక్కలకు కరీంనగర్‌లో పరిశోధన కేంద్రం ఉంది. కందులకు తాండూరు ప్రాంతంలో పరిశోధన కేంద్రం ఏర్పాటుకు పరిశీలన ప్రభుత్వం దృష్టిలో ఉందన్నారు. వనపర్తిలో వేరుశనగ పరిశోధన కేంద్రం ఏర్పాటుకు ఉత్తర్వులిచ్చింది. మిర్చి పరిశోధన కేంద్రం ఏర్పాటుకు నర్సంపేట్‌లో ఏర్పాటు చేస్తామన్నారు. శాసనసభలో ప్రశ్నోత్తరాల సందర్భంగా నర్సంపేట్‌లో మిరప పరిశోధన కేంద్రం ఏర్పాటుపై ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి అడిగిన ప్రశ్నకు వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్ రెడ్డి సమాధానం ఇచ్చారు. మిరప పరిశోధన కేంద్రం ఏర్పాటు కోసం వరంగల్ గ్రామీణ జిల్లా కలెక్టర్ ద్వారా భూమి బదిలీ పక్రియలో ఉందన్నారు. ఈ మిర్చికి అంతర్జాతీయ డిమాండ్ ఉండటంతో ఇక్కడ పరిశోధన కేంద్రం ఏర్పాటు చేయాలని వ్యవసాయ నిపుణులు కోరుతున్నారు. భూమి బదిలీ పక్రియ జరిగిన వెంటనే తదుపరి చర్యలను చేపట్టేందుకు ప్రభుత్వం సానుకూలంగా ఉందని వ్యవసాయ మంత్రి నిరంజన్ రెడ్డి తెలిపారు. ఇదిలావుంటే రైతువేదికలను నైపుణ్య శిక్షణా కేంద్రాలుగా మారుస్తామని అన్నారు. శాసనసభలో ప్రశ్నోత్తరాల సందర్భంగా రైతు వేదికల నిర్మాణంపై సభ్యులు రసమయి బాలకిషన్, ఆశన్నగారి జీవన్ రెడ్డి, పెద్ది సుదర్శన్ రెడ్డి, రమావత్ రవీంద్ర నాయక్ లు అడిగిన ప్రశ్నలకు వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్ రెడ్డి సమాధానం ఇచ్చారు. రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటి వరకు 2,596 రైతు వేదికలు నిర్మించామని తెలిపారు. రైతు వేదికల నిర్మాణాల కోసం రూ. 572 కోట్ల 22 లక్షల మొత్తాన్ని ఖర్చు చేశామన్నారు. వ్యవసాయం, అనుబంధ శాఖల ద్వారా ఆధునిక వ్యవసాయ సమాచారం, అవగాహన కల్పించడం కోసం, నైపుణ్య శిక్షణా కేంద్రాలుగా ఈ వేదికలను ఉపయోగిస్తామన్నారు. రైతులను సంఘటితం చేసేందుకు ఈ వేదికలు ఉపయోగపడుతాయన్నారు. ఇలాంటి వేదికలను ప్రపంచంలో ఎక్కడా నిర్మించలేదన్నారు. సాగు విస్తీర్ణాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రతి ఐదు వేల ఎకరాలకు ఒక ఏఈవోను నియమించుకున్నామని తెలిపారు. ఆ తర్వాత రైతులకు పంటల విధానంపై అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. మంత్రి కేటీఆర్ తన సొంత నిధులతో రైతు వేదికలను నిర్మించారు. రామాయంపేటలో కేటీఆర్ సతీమణి శైలిమ ఒక రైతు వేదిక నిర్మాణానికి ఆర్థిక సాయం అందించారు. తన ఇద్దరు బిడ్డలు కూడా వనపర్తిలో ఒకటి, తమ సొంతూరిలో ఒక రైతు వేదికను నిర్మించి ఇచ్చారు. ఇలా మొత్తం 22 రైతు వేదికలను తమ సొంత నిధులతో పలువురు మంత్రులు ఏర్పాటు చేయించారు అని మంత్రి నిరంజన్ రెడ్డి తెలిపారు.

విశాఖ ఉక్కు సెంటిమెంట్‌పై దాడి

పోస్కోకు కట్టబెట్టడం వెనక మతలబు

మండిపడుతున్న కార్మిక సంఘాలు

విశాఖపట్టణం,మార్చి25(ఆర్ఎన్ఎ): విశాఖ ఉక్కు పరిశ్రమ కోసం ఆనాటి కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా సమైక్య రాష్ట్ర ప్రజలు పెద్ద పోరాటం చేసి ఉక్కును సాధించారు. ఆనాటి ఉద్యమంలో 32 మంది ప్రాణాలు కోల్పోయి అమరులయ్యారు. వందలాది మంది తమ భూములను ఉదారంగా ఉక్కు పరిశ్రమకు కట్టబెట్టారు. ఇది పూర్తిగా సెంటిమెంటుతో కూడుకున్న వ్యవహారం. ఏదేమైనా చివరికి ఆనాటి కేంద్ర ప్రభుత్వం మెడలు వంచి ఉక్కు పరిశ్రమ సాధించుకున్నారు. దీనిని కాలం గడుస్తూ తెగనమ్మేస్తామని మోడీ నిస్సిగ్గుగా ప్రకటించారు. విశాఖ ఉక్కును కాపాడుకోవాలని కార్మిక సంఘాలు, ఆనాడు భూములిచ్చిన కుటుంబాలు ఆందోళన చేస్తున్నా పట్టించుకోవడం లేదు. .సుమారు రూ.3 లక్షల కోట్ల విలువ చేసే ఈ పరిశ్రమ, దానికి అనుబంధంగా ఉండే వేల ఎకరాల భూములను కేవలం రూ.13 వేల కోట్లకు పోస్కో కంపెనీకి ధారాదత్తం చేయడానికి బిజెపి ప్రభుత్వం ఒప్పందం చేసుకున్నది. దక్షిణ కొరియాకు చెందిన ఈ కంపెనీకి దేశ ప్రజల విలువైన ఆస్తులను కారుచౌకగా అమ్మేయడమే దేశభక్తా అని చేస్తున్న ఆక్రందనలను పట్టించుకోవడం లేదు. ఈ పరిశ్రమ కోసం కేంద్ర ప్రభుత్వం పెట్టిన పెట్టుబడి రూ.5 వేల కోట్లు. కాని ఇప్పటికే ఈ పరిశ్రమ నుంచి కేంద్ర ప్రభుత్వానికి రూ.42 వేల కోట్లు, రాష్ట్ర ప్రభుత్వానికి మరో రూ.9 వేల కోట్లు... పన్నులు, డివిడెండ్ల రూపంలో అందింది. ప్రత్యక్షంగా 32 వేల మందికి, పరోక్షంగా మరో 50 వేల మందికి ఉపాధి కల్పించింది. ఈ పరిశ్రమకే గనుక సొంత ఇనుప ఖనిజం గనులను కేటాయించి ఉంటే వేల కోట్ల నికర లాభాలతో ఉండేది. జిందాల్, మిట్టల్, టాటా, వేదాంత, పోస్కో లాంటి ప్రైవేట్ కంపెనీలకు ఇనుప ఖనిజాన్ని కేటాయించి విశాఖ ఉక్కుకు నిరాకరించిన ఫలితంగా నష్టాలు కనపడుతున్నాయి. దీని బాధ్యత కేంద్రానిదే. ఈ కారణాన్ని చూపి ఈ పరిశ్రమను అమ్మేయడానికి బిజెపి ప్రభుత్వం కుట్రలు పన్నుతోంది. అందుకే స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను నిలువరించేందుకు ఎంతకైనా తెగిస్తాం అని సీపీఎం నేత, విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ సభ్యుడు ఎన్.రామారావు స్పష్టం చేశారు. ఆందోళన జరుగుతున్న ఈ నెల 23 రోజుల్లో సుమారు రూ.2500 కోట్లు ఉత్పత్తిని సాధించామన్నారు. గడిచిన 4 నెలల్లో రూ.800 కోట్లు లాభాలు ఆర్జించిన ఏకైక పరిశ్రమ ఉక్కు కర్మాగారమని, అందుకే ప్రైవేట్ కార్పొరేట్ సంస్థలు దీన్ని దక్కించుకునేందుకు చూస్తున్నాయని వివరించారు. 26న జరగనున్న రాష్ట్ర బంద్‌కు కార్మికులతోపాటు మహిళలు, యువత, రైతులు, విద్యార్థులు మద్దతు ఇవ్వాలని పిలుపునిచ్చారు. వేలాది ఎకరాల భూమిని దోచుకునేందుకు స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరణ చేస్తున్నారని ఆరోపించారు. ఏ పరిశ్రమకు అయినా భూములు కేటాయిస్తే వారు అమ్ముకోవడానికి వీల్లేకుండా రాష్ట్ర ప్రభుత్వం చట్టం చేయాలని డిమాండ్ చేశారు.

కర్నూలు కిరీటంలో మరో మణి

ఓర్వకల్లు ఎయిర్‌పోర్టు జాతికి అంకితం

కేంద్రమంత్రి హర్దీప్ సింగ్‌తో కలసి ప్రారంభించిన సిఎం జగన్

ఎయిర్‌పోర్టుకు స్వాతత్ర్య సమరయోధుడు ఉయ్యాలవాడ పేరు

110కోట్లతో అన్ని హంగులతో నిర్మించినట్లు జగన్ ప్రకటన

28నుంచి ప్రధాన నగరాలకు ఇక విమాన సర్వీసులు

కర్నూలు,మార్చి25(ఆర్ఎన్ఎ): ఓర్వకల్లు ఎయిర్ పోర్టును జాతికి అంకితం చేసిన ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి గురువారం ఎయిర్‌పోర్టును ప్రారంభించారు. ఎయిర్ పోర్టుకు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి పేరు పెడుతున్నట్లు ప్రకటించారు. న్యాయ రాజధానికి రాకపోకలు సాగేలా ఈ ఎయిర్ పోర్టు ఉపయోగ పడుతుందంటూ పరోక్షంగా రాజధాని తరలింపుపై జగన్ సంకేతాలిచ్చారు.రాష్ట్రంలో ఇది ఆరవ విమానాశ్రయమని, న్యాయ రాజధాని నుంచి మిగతా రాష్ట్రాలకు ఓర్వకల్లు విమానాశ్రయం కలుపుతుందని సీఎం జగన్ అన్నారు. ఎన్నికలకు నెల రోజుల ముందు.. ఎలక్షన్‌లో లబ్ది పొందేందుకు చంద్రబాబు ఓర్వకల్లు ఏయిర్ పోర్టును ప్రారంభించారని విమర్శించారు. రూ.110 కోట్లతో అన్ని హంగులతో ఎయిర్ పోర్టును తీర్చిదిద్దామన్నారు.

ఓర్వకల్లు ఏయిర్ పోర్టుకు తొలి స్వాతంత్య్ర సమరయోధుడు ఉయ్యాలవాడ నరసింహా రెడ్డి పేరును నామకరణం చేసినట్లు ముఖ్యమంత్రి జగన్ పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సొంతంగా నిర్మించిన కర్నూలు జిల్లా ఓర్వకల్లు ఎయిర్‌పోర్టును సీఎం జగన్‌మోహన్‌రెడ్డి గురువారం అట్టహాసంగా ప్రారంభించారు. ఆయనతో పాటు కేంద్రమంత్రి పి హర్‌దీప్‌సింగ్‌కు కూడా ఓర్వకల్లు ఎయిర్‌పోర్ట్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు. సీఎం జగన్, కేంద్రమంత్రితో కలిసి ఎయిర్‌పోర్ట్‌ను ప్రారంభించి జాతికి అంకితం చేశారు. ముందుగా సీఎం జగన్ జాతీయ జెండాను, ఆ తర్వాత దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాన్ని ఆవిష్కరించారు. ప్రారంభోత్సవ కార్యక్రమంలో సీఎం జగన్ మాట్లాడుతూ.. కర్నూలుకు రోడ్డు, రైలు మార్గంలోనే ప్రయాణం ఉండేదని, ఇక నుంచి విమాన ప్రయాణం కూడా జరగబోతోందని తెలిపారు. ఈనెల 28 నుంచి ఓర్వకల్లు ఎయిర్‌పోర్టు నుంచి విమానాల రాకపోకలు ప్రారంభమవుతాయని చెప్పారు. ప్రారంభంలో బెంగళూరు, చెన్నై, విశాఖకు విమానాలు అందుబాటులో ఉంటాయిని తెలిపారు. ఓర్వకల్లుతో రాష్ట్రంలో ఆరో ఎయిర్‌పోర్టు ప్రారంభమవుతోందని పేర్కొన్నారు. గత ప్రభుత్వం ఎన్నికల ముందు రిబ్బన్ కటింగ్‌తో హడావుడి చేసిందని, అయితే తాము రూ.110 కోట్లు ఖర్చు చేసి కేవలం ఏడాదిన్నరలోనే పనులు పూర్తి చేశామని సీఎం జగన్ తెలిపారు. అధునాతన అగ్నిమాపక కేంద్రం కూడా అందుబాటులో ఉంటుందని, ఈ గడ్డ నుంచే ఉయ్యాలవాడ నరసింహారెడ్డి వచ్చారని చెబుతూ ..ఓర్వకల్లు ఎయిర్‌పోర్టుకు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి పేరును సీఎం జగన్ ప్రకటించారు.

ఇండిగో సంస్థ ఈనెల 28 నుంచి విశాఖ, చెన్నై, బెంగళూరుకు కర్నూలు నుంచి సర్వీసులు నడపనుంది. 1,008 ఎకరాల్లో రూ.153 కోట్లతో ఈ ఎయిర్‌పోర్టు నిర్మాణం పూర్తి చేశారు. ఈ ఏడాది జనవరి 15న లైసెన్స్ జారీ చేయగా.. బీసీఏఎస్ సెక్యూర్డ్ క్లియరెన్స్ జనవరి 27న మంజూరైంది. 2,000 మీటర్ల పొడవు, 30 మీటర్ల వెడల్పులో ఇక్కడి రన్‌వేను అభివృద్ధి చేశారు. నాలుగు విమానాలకు పార్కింగ్‌తో పాటు అన్ని రకాల మౌలిక వసతులను కల్పించారు. కార్యక్రమంలో మంత్రులు, ఎమ్మెల్యేలు, స్థానిక నేతలు పలువురు పాల్గొన్నారు.

మహారాష్ట్ర,పంజాబ్‌లలో పెరుగుతున్న కరోనా

ఆందోళన వ్యక్తం చేసిన కేంద్ర ఆరోగ్యశాఖ

ఢిల్లీ,ముంబై,హర్యానాల్లో హోళీ వేడుకలు నిషేధం

న్యూఢిల్లీ,మార్చి24(ఆర్ఎన్ఎ): మహారాష్ట్ర, పంజాబ్‌లలో పెరిగిపోతున్న కరోనా కేసులు ఆందోళన కలిగిస్తున్నాయని కేంద్ర ఆరోగ్య శాఖ కార్యదర్శి రాజేష్ భూషణ్ అన్నారు. గత 24 గంటలలోనే మహారాష్ట్రలో 28 వేల కేసులు నమోదైనట్లు ఆయన చెప్పారు. అటు పంజాబ్ జనాభా లెక్కల ప్రకారం చూసుకుంటే అక్కడి కేసులు చాలా ఎక్కువ అని భూషణ్ అన్నారు. ఇక దేశంలో పది జిల్లాల్లో పరిస్థితి ఆందోళనకరంగా ఉందగా.. అందులో 9 జిల్లాలు మహారాష్ట్రకే చెందినవి కావడం గమనార్హం. పుణె, నాగపూర్, ముంబై, థానె, నాసిక్, ఔరంగాబాద్, నాందేడ్, జల్‌గావ్, అకోలాలతోపాటు కర్ణాటకలోని బెంగళూరు అర్బన్ జిల్లాల్లో కేసులు చాలా ఎక్కువగా ఉన్నట్లు ఆయన వెల్లడించారు. ఇదిలావుంటే కొవిడ్-19 కేసులు పెరుగుతుండటంతో కుంభమేళాలో పాల్గొనే భక్తులను ఆర్టీ-పీసీఆర్ నెగెటివ్ రిపోర్ట్ ఉంటేనే అనుమతించాలని ఉత్తరాఖండ్ హైకోర్టు స్పష్టం చేసింది. కుంభమేళాలో పవిత్ర గంగానదిలో మునక వేసేందుకు ఏప్రిల్ 1 నుంచి హరిద్వార్‌కు వచ్చే భక్తులకు కొవిడ్-19 నెగెటివ్ రిపోర్ట్ అవసరం లేదని సీఎం తిరత్ సింగ్ రావత్ పేర్కొన్న క్రమంలో హైకోర్టు తాజా ఉత్తర్వులు జారీ చేసింది. దేశవ్యాప్తంగా కరోనా కేసులు మళ్లీ పెద్దసంఖ్యలో వెలుగుచూస్తుండటంతో పండుగలు, పర్వదినాల సమయంలో అప్రమత్తగా వ్యవహరించాలని కేంద్ర ప్రభుత్వం పేర్కొంది. కుంభమేళాతో మహమ్మారి కేసులు మరింత పెరగకుండా చర్యలు చేపట్టాలని పేర్కొన్న క్రమంలో అత్యున్నత స్థాయి కేంద్ర బృందం కుంభమేళాతో వైరస్ కేసులు పెరగకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని రాష్ట్ర ప్రభుత్వానికి సూచించింది. హరిద్వార్‌లో జరుగుతున్న కుంభమేళాకు ఉత్తరాఖండ్ ప్రభుత్వం చేపట్టిన వైద్య, ప్రజారోగ్య ఏర్పాట్లను కేంద్ర బృందం ఇటీవల సమీక్షించింది. కుంభమేళాలో స్నానాలు చేస్తున్న యాత్రికుల్లో రోజుకు 20మంది వరకు,స్థానికుల్లో మరో 20 మంది వరకూ ప్రతిరోజూ కరోనా వైరస్ బారినపడుతున్నట్లు కేంద్ర బృందం గుర్తించింది. దేశంలో కరోనా కేసుల సంఖ్య రోజు రోజుకు పెరిగిపోతున్న క్రమంలో ఢిల్లీ, ముంబైలో హోళీ వేడుకలపై ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు నిషేదం విధించాయి. ఢిల్లీలో మంగళవారం ఒక్కరోజే రికార్డు స్థాయిలో 1101 కొత్త కేసులు నమోదు కాగా.. నాలుగురు చనిపోయారు.సాధారణంగా అయినా సరే ఎక్కువ మంది ప్రజలు కలవడంపై బ్యాన్ విధించింది. కరోనా కేసులు ఎక్కువగా నమోదవడంతోనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు అధికారులు చెబుతున్నారు. అలాగే కరోనా కేసులు ఎక్కువగా ఉన్న రాష్ట్రాల నుంచి ఢిల్లీ వచ్చే ప్రజలకు కూడా రైల్వే స్టేషన్లు, ఎయిర్ పోర్టుల్లో, బస్ టర్మినల్స్‌లో కరోనా టెస్టులు నిర్వహిస్తున్నారు. ఇకపోతే కొవిడ్ వ్యాప్తి దృష్ట్యా హర్యానా రాష్ట్ర ప్రభుత్వం హోళీ వేడుకలను నిషేధించింది. ఈ మేరకు హర్యానా హోంమంత్రి అనిల్ విజ్ ట్విట్టర్ ద్వారా స్పందిస్తూ రాష్ట్రంలో హోళీ వేడుకలను నిషేధిస్తున్నట్లు ప్రకటించారు. హర్యానాలో ఇప్పటివరకు 2,82,000 కరోనా వైరస్ కేసులు నమోదవగా కొవిడ్-19 కారణంగా 3,100 మంది చనిపోయారు. కరోనా విస్తరిస్తున్న నేపథ్యంలో సామూహిక సమావేశాలను ఢిల్లీ, ముంబై ఇప్పటికే నిషేధించాయి. కేంద్ర ఆర

కరోనా కల్లోలంలో ఆయుర్వేదానికి పెరిగిన ఆదరణ..!

ఆయుర్వేద చికిత్స అతి పురాతన సంపూర్ణ వైద్య వ్యవస్థ. వ్యాధిని నయం చేయడమే కాకుండా రోగ మూలాలను గుర్తించి సంపూర్ణ ఆరోగ్యాన్ని ప్రసాదించే సుగుణాలు ఆయుర్వేద వైద్యానికి మాత్రమే స్వంతమని గుర్తించారు. అనాదిగా ఆయుర్వేదం మానవాళికి ఆరోగ్య గొడుగుగా అవిశ్రాంత సేవలు అందిస్తున్నది. కోవిడ్-19 కల్లోలంతో మానవాళి దృష్టి ఆయుర్వేదం వైపుకు ఆకర్షితం అయ్యింది. కరోనా మహమ్మారి కట్టడికి సరైన నిర్దిష్ట వైద్య విధానం లేని పరిస్థితుల్లో మానవాళి అయోమయానికి లోనైన వేళ టీకాలు తీసుకోవడానికి కూడా కొందరు జంకడం చూస్తున్నాం. వైద్య నిపుణులు సహితం కరోనా కట్టడికి వైరస్ విధించిన జీవనశైలిలో మార్పులను పాటించడం మాత్రమే సన్మార్గమని తెలుపుతున్నారు. దీనికి తోడుగా వ్యాధినిరోధకశక్తిని పెంచుకోవడం కూడా ఉత్తమ విధానమని సూచిస్తున్నారు. అల్లోపతి వైద్యశాస్త్రం కరోనా వైరస్‌కు సరైన చికిత్స కోసం తీవ్రంగా కృషి చేస్తున్నది. ఆయుర్వేద వైద్యంతో వ్యాధినిరోధకశక్తిని పెంచడం, కరోనా నివారణ మరియు కోవిడ్-19 చికిత్స మార్గాలు ప్రజలకు అందుబాటులోకి వచ్చాయి. భారతీయ ఆయుర్వేద పరిశ్రమ అతి వేగంగా అభివృద్ధి చెందుతూ, విస్తృత పరిధిలో ఉత్పత్తులను అందించడం జరుగుతోంది. నేటికీ అల్లోపతి వైద్యశాస్త్రంలో కామెర్లు(జాండిస్), మూలశంక (పైల్స్) మరియు పిత్తాశయ (బిలియస్‌నెస్) సమస్యలకు సరైన చికిత్స అందుబాటులో లేకపోవడం విచారకరం. ఇలాంటి వ్యాధులకు కూడా ఆయుర్వేదంలో చికిత్స విధానాలు అమలు అవుతున్నాయి. ఆయుర్వేదం నెమ్మదిగా పని చేసినా, వ్యాధి మూలాలను గుర్తించి నయం చేయడం జరుగుతుంది.

భారతీయులు కరోనాకు సమాధానంగా వ్యాధినిరోధకశక్తిని పెంచుకోవడానికి ఆయుర్వేద మార్గాన్ని అనుసరిస్తున్నారు. అశ్వగంధ, బ్రహ్మీ, పసుపు, చేదు పుచ్చకాయ (బిట్టర్ మెలన్), జీలకర్ర, గోటు కోల, లైకోరైస్ వేర్లు, మిరియాలు, గిలోయ్ రసం లాంటి ఇంటింటి అందుబాటులో ఉన్న సుగంధ ద్రవ్యాలను రోగనిరోధకశక్తిని పెంచే ఔషధాలుగా తీసుకోవడం ప్రారంభించారు. గతంలో ఆయుర్వేద ఉత్పత్తులు కేశ తైలాలు (హెయిర్ ఆయిల్), చవన్‌ప్రాష్ లాంటివి మాత్రమే వాడడం చూశాం. ప్రస్తుతం మార్కెట్‌లో విస్తృత సహజ మూలికా ఆయుర్వేద ఉత్పత్తులైన షాంపూలు, టూత్ పేస్టులు, చర్మ సంరక్షణ క్రీమ్‌లు, నూనెలు, చూర్ణాలు, సబ్బులు, దగ్గు టానిక్‌లు, టీ పొడులు, పండ్ల రసాలు, పోషకాహార ఉత్పత్తులు లాంటి అసంఖ్యాక వినియోగ వస్తువులు అందుబాటులోకి వచ్చాయి. ఆయుర్వేదానికి ప్రధాన గ్రంథంగా 'చరక సంహిత' నేటికీ ప్రమాణంగా నిలుస్తున్నది. ఆయుర్వేద ఉత్పత్తులు బహుళ ప్రచారంలోకి రావడం, వినియోగం పెరగడంతో బహుళజాతి కంపెనీలు కూడా తమ దృష్టిని ఆయుర్వేద ఉత్పత్తుల వైపుకు మరల్చడం జరుగుతోంది. డాబర్, పతంజలి మరియు కాల్గెట్ కంపెనీలు 7,000 కోట్ల టూత్‌పేస్టుల మార్కెట్‌లో అధిక శాతం తమ మూలికా ఉత్పత్తులను మార్కెట్‌లోకి తీసుకురావడం చూస్తున్నాం. టూత్‌పేస్టుల్లో 20.1 శాతం, బాడీ లోషన్లలో 17.5 శాతం మరియు షాంపూల్లో 13.2 శాతం సహజ ఆయుర్వేద ఉత్పత్తులు వినియోగించడం జరుగుతోంది. ఉత్తర భారతంలో ప్రసిద్ధి గాంచిన ఆయుర్వేద కేశ తైలం 'కేశ్ కింగ్'ను ప్రముఖ యంయన్‌సి 'ఇమామి' కంపెనీ కొనడం జరిగింది. కేరళాలో వాడే 'ఇందులేఖ' హెయిర్ ఆయిల్‌ను 'హిందూస్తానీ యూనీలివర్ లిమిటెడ్ (హెచ్‌యూయల్)' కంపెనీ మరియు 'నిహార్ శాంతి' హెయిర్ ఆయిల్‌ను 'మరీకో' కంపెనీ స్వంతం చేసుకోవడం జరిగింది. హిందూస్తానీ యూనీలివర్ లిమిటెడ్ కంపెనీ ఆయుర్వేద ఉత్పత్తుల్లో టూత్‌పేస్టులు, సబ్బులు, ఫేస్ వాష్‌లు, ఫేస్ క్రీమ్‌లు, షాంపూల మరియు హాండ్ వాష్‌లు లాంటివి అనేకం ఉన్నాయి.

ప్రపంచంలోనే అతి పెద్ద ఆయుర్వేద కంపెనీగా పేరుగాంచిన 'డాబర్' ద్వారా 250కి పైగా ఉత్పత్తులు వినియోగదారులకు అందుబాటులో ఉన్నాయి. కాల్గెట్ కంపెనీ ద్వారా ఆయుర్వేద 'వికో వజ్రదంతీ' మరియు 'వేద క్రాంతి' (పతంజలి 'దంతక్రాంతి'కి పోటీగా) టూత్‌పేస్టులు మార్కెట్‌లో కనిపిస్తున్నాయి. బాబా రామ్‌దేవ్ స్థాపించిన 'స్వదేశీ పతంజలి' ద్వారా సహజ ఆయుర్వేద ఉత్పత్తులతో ఆయుర్వేద శాస్త్రానికి మరియు ప్రజాదరణ పెరగడం, ఇతర యంయన్‌సిలు అదే మార్గంలో ఆయుర్వేద ఉత్పత్తులు తీసుకురావడం చూస్తున్నాం. ప్రపంచవ్యాప్తంగా రాబోయే రోజుల్లో ఆయుర్వేద ఉత్పత్తులకు బహుళ ప్రచారం జరిగి, మార్కెట్‌కు ఆదరణ పెరిగి, అనేక బహుళజాతి సంస్థలు ఆయుర్వేదం వైపుకు చూడడం అనివార్యం అయ్యింది. 'స్వదేశీ' ఆయుర్వేద మూలికా వైద్యం సరిహద్దులు చెరుపుకొని విశ్వ మహమ్మారుల కట్టడికి విదేశాలకు వ్యాపిస్తూ అందరికీ ఏకైక మార్గాన్ని చూపుతుందని భారతీయులు నమ్ముతున్నారు. ఆయుర్వేదం అంతర్జాతీయం కావాలి, ప్రజారోగ్యానికి పట్టం కట్టాలని సగటు భారతీయుడిగా కోరుకుందాం, కరోనా కొమ్ముల్ని కసితో విరుద్దాం.

– డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి

ఎన్నికల కారణంగానే పెట్రో ధరల్లో మార్పులు

–స్వల్ప తగ్గింపుల వెనక రాజకీయం

న్యూఢిల్లీ,మార్చి25(ఆర్ఎన్ఎ): వినియోగదారులకు చుక్కలు చూపించిన పెట్రోల్, డీజిల్ ధరలు వరుసగా రెండో రోజు తగ్గాయి. అంతర్జాతీయంగా ముడి చమురు ధరలు పడిపోవడంతో దేశీయ చమురు సంస్థలు కూడా పెట్రో ధరలను స్వల్పంగా తగ్గించాయి. అయితే నాలుగు రాష్ట్రాల ఎన్నికలను దృష్టిలో పెట్టుకుఇన ధరలు తగ్గిస్తున్నారని విమర్శలు ఉన్నాయి. కేవలం ఎన్నికల ముందు ధరలు తగ్గడం గతంలో చూశామని అన్నారు. బుధవారం లీటర్ పెట్రోల్ 18 పైసలు, డీజిల్‌పై 17 పైసలు తగ్గించిన విషయం తెలిసిందే. తాజాగా దేశరాజధానిలో పెట్రోల్‌పై 21 పైసలు, డీజిల్‌పై 20 పైసల చొప్పున తగ్గించాయి. దీంతో ఢిల్లీలో లీటర్ పెట్రోల్ ధర రూ.90.78, డీజిల్ రూ.81.10కి పడిపోయాయి. అదేవిధంగా ముంబైలో పెట్రోల్ రూ.97.19, డీజిల్ రూ.88.20గా ఉన్నాయి. ఇక చెన్నైలో పెట్రోల్ రూ.92.77, డీజిల్ రూ.86.10, కోల్‌కతాలో రూ.90.98, డీజిల్ రూ.83.98, బెంగళూరులో పెట్రోల్ రూ.94.04, డీజిల్ రూ.86.21గా ఉంది. ల్గ÷దరాబాద్‌లో పెట్రోల్, డీజిల్ ధరలు స్వల్పంగా తగ్గాయి. నగరంలో లీటర్ పెట్రోల్ రూ.94.61, డీజిల్ రూ.88.67గా ఉన్నాయి. కరీంనగర్‌లో పెట్రోల్ రూ.94.48, డీజిల్ రూ.88.55 కొనసాగుతోంది. ంధ్రప్రదేశ్‌లో ప్రముఖ నగరాలైన విజయవాడలో లీటర్ పెట్రోల్ ధర రూ.97.24, డీజిల్ రూ.90.76గా ఉండగా, విశాఖపట్నంలో పెట్రోల్ రూ.97.24, డీజిల్ రూ.90.76గా ఉంది. గతేడాది మార్చి 16 తర్వాత పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గడం తొలిసారిగా బుధవారం తగ్గాయి. ఏడాది కాలంగా ముడి చమురు ధరలు స్థిరంగా ఉన్నప్పటికీ.. దేశంలో పెట్రోల్‌పై రూ.21.58, డీజిల్‌పై రూ.19.18 పెరిగాయి. ఎన్నికలు ముగిశాక మళ్లీ ధరలు పెరగడం ఖాయమని పలుపార్టీల నేతల వ్యాఖ్యానించారు.

మారుపాక గ్రామంలో పలు పనులకు భూమిపూజ

రాజన్న సిరిసిల్ల, మార్చి 25: (నేటినిజం ప్రతినిధి) :వేములవాడ అర్బన్ మండలం మారుపాక గ్రామం లో సర్పంచ్ చెన్నమనేని స్వయంప్రభ ఆధ్వర్యంలో గురువారం గ్రామంలో ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో 13 లక్షలతో సీసీ రోడ్డు పనులకు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా జడ్పీటీసీ రవి, సర్పంచ్ స్వయం ప్రభ , టీఆర్ఎస్ నాయకుడు బు?ర బాబు మాట్లాడుతూ అభివృద్ధి సమస్యలకు ప్రతి ఒక్కరు సహ కరించాలని కోరారు. సీసీ రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేసిన ఎమ్మెల్యే రమేశ్ బాబు కు వారు కృతజ్ఞతలు తెలిపారు ఈ కార్యక్రమంలోఉప సర్పంచ్ తుమ్మల శ్రీను, టీఆర్ఎస్ నాయకులు బు?రబాబు ,వార్డు సభ్యులు శ్రీశైలం ,పర్శరాములు, పిట్టల అంజయ్య,గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

రంగస్థల కళాకారులకు సన్మానం

రాజన్న సిరిసిల్ల, మార్చి 25: (నేటినిజం ప్రతినిధి): ప్రపంచ రంగ స్థలదినోత్సవం నిపురస్కరిం చుకుని వేములవాడ నృత్య కళానికేతన్ ఆధ్వర్యంలో గురువారం కళాకారులకు సన్మానం చేశారు.వీరిలో నలుగురు కళాకారులు ఎంపిక చేసి వారిలో కీసర నరసింగం, పావన పెళ్లి శ్రీనివాస్,జి చంద్రయ్య, ఇంద్రాల వోహాన్ లను ఘనంగా సన్మానించారు.అనంతరం నత్య కళానికేతన్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎలాపోశెట్టి,అధ్యక్షుల గంగా శ్రీకాంత్ మాట్లాడుతూ ప్రపంచ రంగస్థల దినోత్సవం పురస్కరించుకొని రంగస్థల కళాకారుల నుండి నలుగురిని ఎంపిక చేసి సన్మానించడం అయినది అని ప్రతి సంవత్సరం నలుగురి కళాకారులను సన్మానించడం జరుగుతుందని అని అన్నారు. మన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగ కళాకారులకు నెలకు ఐదు వేల భృతిని ఏర్పాటు చేయాలని కోరామన్నారు కళాకారులకు ఉచిత బస్సు పాస్ సౌకర్యం కల్పించి రైల్లో 50శాతం సదుపాయం రాయితీ కల్పించి కళాకారులకు భీమా భీమా సౌకర్యం కల్పించాలని కోరారు. గౌరవాధ్యక్షులు సోమినేని బాలు మాట్లాడుతూ ప్రతి కళాకారునికి డబుల్ బెడ్ రూమ్ ఇల్లు సదుపాయం కల్పించాలన్నారు గౌరవాధ్యక్షులు కనపర్తి హనుమాన్లు మాట్లాడుతూ కళాకారులకు ఆర్థికంగా అన్ని రంగాల్లో ఆర్థిక సాయం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నత్య కళానికేతన్ సభ్యులు మామిళ్ల సత్తయ్య దీన వేణి బాదం నా అనిల్ తదితరులు పాల్గొన్నారు.

ఉమ్మడి ఏపీలో సాగునీటి రంగంలో తీరని అన్యాయం

కెసిఆర్‌తోనే తెలంగాణ నీటి అసవరాలు తీరాయి
కాళేశ్వరం ఇంజనీరింగ్ ప్రతిభకు అద్దం పడుతోంది
బడ్జెట్ పద్దులపై చర్చల్లో ఎమ్మెల్యేలు

హైదరాబాద్,మార్చి25(ఆర్ఎన్ఎ): ఉమ్మడి ఏపీలో సాగునీటి రంగంలో తెలంగాణకు తీవ్ర అన్యాయం జరిగింది. కానీ స్వరాష్ట్రంలో సాగునీటి రంగానికి ముఖ్యమంత్రి కేసీఆర్ అత్యధిక ప్రాధాన్యత ఇచ్చారని టిఆర్ఎస్ ఎమ్మెల్యేలు అన్నారు. ఎక్కడ నీల్లు ఉన్నాయో గుర్తించి వాటిని తరలించే బృహత్తర ఆలోచనలతో కెసిఆర్ అపరభగీరథుడిగా నిలిచారని అన్నారు. అలా ఇవాళ తెలంగాణలో ప్రాజెక్టులకు రూపకల్పన జరిగిందన్నారు. శాసనసభలో బడ్జెట్ పద్దులపై చర్చ సందర్భంగా ఇరిగేషన్ పద్దులపై తాండూరు ఎమ్మెల్యే రోహిత్ రెడ్డి మాట్లాడారు. సీఎం కేసీఆర్ తీసుకున్న నిర్ణయాలతో ఇప్పటికే పలు ఇరిగేషన్ ప్రాజెక్టులు పూర్తయ్యాయి. మరికొన్ని ప్రాజెక్టుల నిర్మాణాలు చివరి దశలో ఉన్నాయి. సాగునీటి రంగానికి ప్రాధాన్యత ఇచ్చి.. వ్యవసాయ రంగంలో విప్లవాత్మకమైన మార్పులు తీసుకొచ్చారని చెప్పారు. కోటి ఎకరాలకు సాగునీరు అందించేందుకు సీఎం సంకల్పించారు. ప్లలెర్లు మొలిచిన బీడు భూములు.. నేడు ఆకుపచ్చ భూములుగా మారాయి. ఇంజినీర్లకే పెద్ద ఇంజినీర్‌గా మారి కాళేశ్వరం ప్రాజెక్టుకు సీఎం రూపకల్పన చేశారు. ప్రజల ఆకాంక్షలపై మనసు పెట్టి ఆలోచించే సీఎం కేసీఆర్ ఒక్కరే అని పేర్కొన్నారు. తెలంగాణ ఏర్పాటుకు ముందు సాగునీటి కోసం రైతులు.. తాగునీటి కోసం ప్రజలు విలవిలలాడేవారు. మన వాటాను సద్వినియోగం చేసుకోలేకపోయాం. సీఎం కేసీఆర్ ధృడ సంకల్పంతోనే నేడు తెలంగాణ ప్రాజెక్టులకు నీళ్లు వస్తున్నాయి. పంటలు పండించుకుని రైతులు సంతోషంగా ఉన్నారు. మిషన్ కాకతీయ పథకంతో చెరువులకు పూర్వ వైభవం కల్పించారు. రైతుల అవసరాలు, నీటి లభ్యత మేరకు చెక్‌డ్యాంలను ఏర్పాటు చేశారు. ఇప్పుడు ఎక్కడ చూసినా భూగర్భ జలాలు పెరుగుతున్నాయి. దీంతో రైతులు అద్భుతాల్ని ఆవిష్కరిస్తున్నారు. కనివీని ఎరుగని రీతిలో పంటలు పండిస్తున్నారు. సాగునీటి రంగంలో దేశంలోనే తెలంగాణ మేటిగా నిలబడిందని ఎమ్మెల్యే రోహిత్ రెడ్డి అన్నారు. తెలంగాణలో సీఎం కేసీఆర్ సాగునీటి రంగానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నారని మరో ఎమ్మెల్యే దివాకర్ రావు స్పష్టం చేశారు. గత ప్రభుత్వాలు సాగునీటి రంగాన్ని పట్టించుకోలేదన్నారు. టీడీపీ హయాంలో 10 సంవత్సరాల్లో రూ. 10 వేల కోట్లు, కాంగ్రెస్ హయాంలో రూ. 55 వేల కోట్లు ఖర్చు పెడితే.. టీఆర్ఎస్ ప్రభుత్వం ఆరున్నరేండ్లలో రూ. లక్షా 55 వేల కోట్లు ఖర్చు పెట్టిందన్నారు. ఈ బ్జడెట్‌ను చూస్తుంటే.. సీఎం కేసీఆర్ రైతు పక్షపాతి అని అర్థమవుతుందన్నారు. తెలంగాణ ఏర్పడినప్పుడు 24 లక్షల టన్నుల ధాన్యం పండిస్తే.. ఇప్పుడు అది 64 లక్షల టన్నులకు చేరిందన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టును మూడేండ్లలో పూర్తి చేసి చివరి ఎకరా వరకు సాగునీరు అందిస్తున్నారు. కాళేశ్వరం విషయంలో ప్రతిపక్షాలు మాట్లాడుతున్న మాటలు సరియైనవి కావు అన్నారు. గత ప్రభుత్వాలు తెలంగాణలోని ఇరిగేషన్ ప్రాజెక్టులను పట్టించుకోలేదన్నారు. కానీ సీఎం కేసీఆర్ నాయకత్వంలో ఇరిగేషన్ ప్రాజెక్టులు పూర్తవుతున్నాయి. కాళేశ్వరం ప్రాజెక్టుకు జాతీయ హోదా కల్పించాలని కేంద్రానికి సీఎం కేసీఆర్ ఎన్నిసార్లు విజ్ఞప్తి చేసినప్పటికీ పట్టించుకోవడం లేదన్నారు. తెలంగాణపై కేంద్రం వివక్ష చూపుతుందని దివాకర్ రావు మండిపడ్డారు.

తమిళనాడకూ పసుపుబోర్డు హామీ

–బిజెపి అక్కడ ఎన్నికల హామీ ప్రకటన

న్యూఢిల్లీ,మార్చి25(ఆర్ఎన్ఎ): పసుపు బోర్డు ఖాయమంటూ గత పార్లమెంట్ ఎన్నికల ముందు తెలంగాణలో ప్రకటించిన బీజేపీ.. ఇప్పుడు తమిళనాట అలాంటి హామీనే ఇచ్చింది.

తమిళనాట పసుపుబోర్డు ఏర్పాటు చేస్తామని ప్రకటించింది. తమిళనాడులో.. పసుపు బోర్డుపై బీజేపీ మరో గేమ్ మొదలుపెట్టింది. తెలంగాణలో పసుపు బోర్డు సాధిస్తానని ఎన్నికల్లో పోటీ చేసి గెలిచిన ఎంపీ ధర్మపురి అరవింద్.. ఆ తర్వాత పసుపు బోర్డు ఊసెత్తలేదు. కేంద్రం కూడా అలాంటి ఆలోచన లేదని చెబుతోంది. ఎప్పటికైనా పసుపు బోర్డు ఏర్పడుతుందనే ఆశాభావంతో ఉన్న తెలంగాణ రైతాంగానికి కేంద్రం షాకిచ్చింది. తమిళనాడులో ఎన్నికలవేళ మళ్లీ పసుపు బోర్డు ఏర్పాటు చేస్తామంటూ అక్కడ ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టింది. ఇదంతా పచ్చి మోసమని విపక్షాలు విమర్శిస్తున్నాయి. ఎన్నికలు జరిగే రాష్ట్రాలకే బీజేపీ ప్రాజెక్టులు ప్రకటిస్తోందని టీఆర్ఎస్ విమర్శిస్తోంది. పసుపు బోర్డు తేలేకపోతే రాజీనామా చేస్తానని బాండ్ పేపర్ ఇచ్చిన అరవింద్ తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తోంది. నిజామాబాద్‌లో సుగంధ ద్రవ్యాల ప్రాంతీయ కార్యాలయం ఏర్పాటు చేసినందున పసుపు బోర్డు ఏర్పాటు సాధ్యం కాదని కేంద్రమంత్రి నరేంద్ర సింగ్ తేల్చి చెప్పారు. పసుపు సహా సుగంధ ద్రవ్యాల ఎగుమతుల ప్రోత్సాహం కోసం వరంగల్, నిజామాబాద్, హైదరాబాద్, ఖమ్మంలో సుగంధ ద్రవ్యాల బోర్డు ప్రాంతీ య కార్యాలయాలు ఉన్నాయని కేంద్రం చెబుతోంది.

కళ్యాణానికి ముస్తాబైన శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయం

రాజన్న సిరిసిల్ల, మార్చి 25: (నేటినిజం ప్రతినిధి):చందుర్తి మండలం బండపల్లి గ్రామంలో ప్రహ్లాద పర్వతంపై వెలసిన శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో జరుగుతున్న అద్యాయన బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం స్వామివారి కల్యాణాన్ని అత్యంత ఘనంగా నిర్వహించేందుకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు, ప్రతి సంవత్సరం ఆలయంలో అద్యా యన బ్రహ్మోత్సవాలు ఘనంగా నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది,ఈనెల 23వ తేదీ నుండి 28వ తేదీ వరకు బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నారు, బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఈనెల 26వ తేదీన 11 గంటల 5 నిమిషాలకు కళ్యాణాన్ని నిర్వహిస్తున్నారు, ఈ సందర్భంగా ఆలయాన్ని విద్యుత్ దీపాలు, రంగులతో ముస్తాబు చేశారు,బ్రహ్మోత్సవాలలో చివరి రోజు 28వ తేదీ ఆదివారం స్వామివారి రథోత్సవం నిర్వహిస్తారు, బ్రహ్మోత్సవాల సందర్భంగా భక్తులకు చలవా పందిళ్లు, మంచినీళ్లు, అన్నదాన కార్యక్రమాలను ఏర్పాటు చేస్తున్నారు, బ్రహ్మోత్సవాల్లో భాగంగా ప్రతి రోజు ఉదయం సాయంత్రం స్వామి వారి సన్నిధిలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు, ఆలయ ప్రధాన అర్చకులు కొదమ గుండ్ల శ్రీకాంతచార్యుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు జరుగుతున్నాయి, బ్రహ్మోత్సవాల సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా గ్రామ సర్పంచ్ న్యాత విజయ, ఆలయ కమిటీ చైర్మన్ గడ్డం సంజీవరెడ్డి, ఉప సర్పంచి కాసారపు గంగాధర్ గౌడ్ ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీ పాలకమండలి సభ్యులు, ఆలయ కమిటీ సభ్యులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు,

గ్రామాల్లో పల్లె స్వరాజ్యం కనిపిస్తోంది

కెసిఆర్ ఆదేవాలతో తండాల్లో అభివృద్ధి
శాసనసభ చర్చలో ఎమ్మెల్యే రేఖా నాయయక్
కెసిఆర్ తమ గాంధీ అంటూ ప్రశంసలు
లంబాడా భాషలో కొనసాగిన ప్రసంగం

హైదరాబాద్,మార్చి25(ఆర్ఎన్ఎ): గాంధీ కలలుకన్న గ్రామస్వరాజ్యం నేడు పల్లెల్లో కనిపిస్తోందని ఖానాపూర్ టీఆర్ఎస్ ఎమ్మెల్యే రేఖా నాయక్ అన్నారు. ఆమె తన ప్రసంగాన్ని లంబాడీ భాషలో కొనసాగించారు. మధ్యలో తెలుగు మాట్లాడుతుండగా.. లంబాడీ భాషలోనే మాట్లాడాలని ఆమెను స్పీకర్ పోచారం ప్రోత్సహించారు. శాసనసభలో బడ్జెట్ పద్దులపై చర్చ సందర్భంగా పంచాయతీరాజ్ పద్దులపై ఎమ్మెల్యే రేఖా నాయక్ మాట్లాడారు. సీఎం కేసీఆర్ వల్లే తండాలు నేడు అభివృద్ధి చెందుతాయని తెలిపారు. గాంధీజీ, సేవాలాల్ ఆదర్శాలను సీఎం కేసీఆర్ అమలు చేస్తున్నారు. గాంధీ, సేవాలాల్ మాదిరిగా సీఎం కేసీఆర్ కనిపిస్తున్నారు. గిరిజన తండాలు, గూడెలను గ్రామపంచాయతీలుగా తీర్చిదిద్దిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. ఇప్పుడు అధికారులు తండాలకు వచ్చి సమస్యలను పరిష్కరిస్తున్నారని పేర్కొన్నారు. ప్లలె ప్రగతి కార్యక్రమంతో తండాల్లో సీజనల్ వ్యాధులు పూర్తిగా నివారించగలిగామని తెలిపారు. గతంలో ఉన్న కాంగ్రెస్ నాయకురాళ్లు ఇందిరాగాంధీ, గీతారెడ్డి, రేణుకా చౌదరి తండాల్లో పర్యటించేవారు.. కానీ ఆడబిడ్డలు నీళ్ల కోసం పడుతున్న కష్టాలను పట్టించుకోలేదు. ఇప్పుడు సీఎం కేసీఆర్ తండాలకు కూడా మిషన్ భగీరథ కింద సురక్షితమైన తాగునీరును సరఫరా చేస్తున్నారని స్పష్టం చేశారు. తండాలకు, గూడేలకు త్రీ ఫేజ్ కరెంట్ అందించడం గొప్ప విషయమని ఎమ్మెల్యే రేఖా నాయక్ అన్నారు. కెసిఆర్ తమకు గాంధీ లాంటి వాడన్నారు. తమ సమస్యలను గుర్తించి తండాలను పంచాయితీలు చేసి సమస్యలు పరిష్కరించారని అన్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ఎమ్మెల్యే సీతక్కపై ఖానాపూర్ టీఆర్ఎస్ ఎమ్మెల్యే అజ్మీరా రేఖానాయక్ ఫైర్ అయ్యారు. పంచాయతీరాజ్ పద్దులపై రేఖా నాయక్ మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం తండాలు, గూడెంల అభివృద్ధికి తీసుకుంటున్న చర్యలను రేఖా నాయక్ వివరిస్తున్న సమయంలో కాంగ్రెస్ ఎమ్మెల్యే సీతక్క రన్నింగ్ కామెంట్రీ చేశారు. తండాలు, గిరిజన గూడెంలలో అభివృద్ధి ఎక్కడా? అంటూ సీతక్క వ్యాఖ్యానించారు. దీంతో రేఖానాయక్ ప్రతి విమర్శలు చేశారు. గిరిజన బిడ్డవు నీవు ఒక్కదానివే కాదు.. తాను కూడా ఓ గిరిజన బిడ్డను అని సీతక్కకు రేఖా నాయక్ ధీటుగా సమాధానం ఇచ్చారు. బాపునగర్ తండా బాధలు, ఇంద్రవెల్లి, ఉట్నూరు గిరిజనుల బాధలు నీకేం తెలుసు అని కడిగి పాడేశారు. మా ఓట్లతో గెలిచావు కానీ.. మా సమస్యలు పట్టవు అంటూ సీతక్కపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తండాలు, గూడెంలను గ్రామపంచాయతీ లుగా తీర్చిదిద్దిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. తంలో ఉన్న కాంగ్రెస్ నాయకురాళ్లు ఇందిరాగాంధీ, గీతారెడ్డి, రేణుకా చౌదరి తండాల్లో పర్యటించేవారు.. కానీ ఆడబిడ్డల నీళ్ల కోసం పడుతున్న కష్టాలను పట్టించుకోలేదు. ఇప్పుడు సీఎం కేసీఆర్ తండాలకు కూడా మిషన్ భగీరథ కింద సురక్షితమైన తాగునీరును సరఫరా చేస్తున్నారని స్పష్టం చేశారు. తండాలకు, గూడేలకు త్రీ ఫేజ్ కరెంట్ అందించడం గొప్ప విషయమని ఎమ్మెల్యే రేఖా నాయక్ అన్నారు.

ఇక ఆరెస్సెస్‌ను సంఘ్ పరివార్‌గా పిలవను : రాహుల్ గాంధీ

న్యూఢిల్లీ, మార్చి 25: ఆరెస్సెస్ దాని అనుబంధ సంఘాలను సంఘ్ పరివార్‌గా పిలవడం సరైంది కాదని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ అన్నారు. కుటుంబం అంటే మహిళలు, పెద్దల పట్ల ఆప్యాయత, గౌరవం కనబరిచే వాతావరణం ఉంటుందని, ఆరెస్సెస్‌లో ఇలాంటివి మచ్చుకైనా కనిపించవని వ్యాఖ్యానించారు.

కేరళకు చెందిన నన్స్ పట్ల యూపీలో కొందరు మతమార్పిడికి ప్రచారం చేస్తున్నారని వేధింపులకు గురిచేసిన ఘటన వెలుగులోకి వచ్చిన నేపథ్యంలో రాహుల్ ఈ వ్యాఖ్యలు చేశారు. మైనారిటీలపై వివక్ష, ఒక వర్గాన్ని మరో వర్గంపై రెచ్చగొటే సంఘ్ పరివార్ తీరే నన్స్‌పై వేధింపులకు దారితీసిందని రాహుల్ పేర్కొన్నారు. తాను రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్‌ను ఇక ఎన్నడూ సంఘ్ పరివార్ (ఐక్య కుటుంబం)గా పిలవబోనని రాహుల్ ట్వీట్ చేశారు.

19 బిల్లులకు ఆమోదం.. రాజ్యసభ నిరవధిక వాయిదా

న్యూఢిల్లీ, మార్చి 25: రాజ్యసభ ఇవాళ నిరవధిక వాయిదా పడింది. 253వ రాజ్యసభ సమావేశాలు ముగిసినట్లు చైర్మెన్ వెంకయ్యనాయుడు తెలిపారు. కోవిడ్ నిబంధలు పాటిస్తూ నిర్వహించిన రెండవ సెషన్ అని చెప్పారు. 23 సిట్టింగ్‌లతో సభ ముగించినట్లు తెలిపారు. మొత్తం 104 గంటల పాటు సభా కార్యకలాపాలు జరిగాయి. హౌజ్ ప్రొడక్టివిటీ 99 శాతం ఉన్నట్లు ఆయన చెప్పారు. విపక్ష సభ్యుల అవాంతరాల వల్ల సభ సుమారు 21 గంటల పాటు జరగలేదన్నారు. ఈ బడ్జెట్ సెషన్‌లో మొత్తం 19 బిల్లులు పాసైనట్లు వెంకయ్య వెల్లడించారు.

వాయలార్ భావోద్వేగం..

చివరి రోజు సందర్భంగా ఎంపీలు వాయలార్ రవి, కేకే రాగేశ్, అబ్దుల్ వాహబ్‌లకు ఫేర్‌వెల్ పలికారు. ఆ ముగ్గురికీ చైర్మన్ నివాళి అర్పించారు. వాళ్లు సభను వీడి వెళుతున్నా.. వాళ్లు సభకు అమూల్యమైన భాగస్వామ్యాన్ని అందించారన్నారు. వాళ్లు కేవలం రిటైర్ అవుతున్నారని, అలసిపోలేదన్నారు. కేరళకు చెందిన వాయలార్ రవి .. నాలుగు సార్లు రాజ్యసభకు ఎన్నికయ్యారు. ఫేర్‌వెల్ సందేశం వినిపించిన ఎంపీ రవి.. సభలో భావోద్వేగానికి లోనయ్యారు.

ఘనంగా అంకురారోపణ

రాజన్న సిరిసిల్ల, మార్చి 25: (నేటినిజం ప్రతినిధి):చందుర్తి మండలం బండపల్లి శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో జరుగుతున్న అద్యాయన బ్రహ్మోత్సవాల్లో భాగంగా మూడవరోజు గురువారం స్వామివారికి ఆలయ ప్రధాన అర్చకులు కొదమ గుండ్ల శ్రీకాంత చార్యుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు, ఉదయం స్వామివారికి పుణ్యవచనం, ధ్వజారోహణం, పుట్ట బంగారం, అంకురారోపణ, సాయంత్రం చతుర్థ అర్చన, హోమం, బలిహరణ, తీర్థ ప్రసాదన కార్యక్రమాలను నిర్వహించారు, ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి న్యాత విజయ, ఆలయ కమిటీ చైర్మన్ గడ్డం సంజీవరెడ్డి,ఉప సర్పంచ్ కాసారపు గంగాధర్,నాయకులు గడ్డం శ్రీనివాసరెడ్డి, చింతలపల్లి మునిందర్ రెడ్డి,అంజి రెడ్డి, మామిడి రాములు, తాడిచెట్టి తిర